Follow: @ANNTELUGU
03-03-2025
ANN తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 91 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్

## చెడు పనులను గొప్పగా చూపించవద్దు



- సినిమా రంగం బాధ్యతాయుతమైన మాధ్యమం
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- అలనాటి నిర్మాత కృష్ణవేణి సంస్మరణ సభలో ప్రసంగం

02

## రాష్ట్రంలో పాలన పడకేసింది



- పాలన చేతకాని సీఎం ప్రతిపక్షాలపై విమర్శలు
- మోడీని కలిసిన రేవంత్ రాహుల్ ను ఎందుకు కలవలేదు
- బీసీలపై కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉంటే బీసీని సీఎం చేయాలి
- ఎంపీ రఘునందన్ రావు

02

## ఉగాది నుంచి గద్దర్ సినీ అవార్డులు



- వెల్లడించిన డిప్యూటీ సీఎం భట్టి
- ఘనంగా భక్త రామదాసు జయంతి ఉత్సవాలు

02



## న్యూజిలాండ్‌పై టీమిండియా ఘన విజయం

### వరుణ్ స్పిన్ ధాటికి.. న్యూజిలాండ్ విలవిల

### టీమిండియా హ్యాట్రిక్ విజయం

**మహా:** ఛాంపియన్స్ ట్రోఫీ2025లో టీమిండియా హ్యాట్రిక్ విజయాలు నమోదు చేసింది. గ్రూప్‌ఏలో భాగంగా న్యూజిలాండ్‌తో ఇవాళ (మార్చి 2) జరిగిన మ్యాచ్‌లో భారత్ 44 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేయగా.. ఛేదనలో తడబడిన

మిగతా 8లో



## మీనాక్షిపై ఫేక్ ప్రచారం

### ఏపీ సర్కారు క్లారిటీ

**మహా:** "ఆంధ్రప్రదేశ్ ఉమెన్ ఎంపవర్మెంట్ బ్రాండ్ అంబాసిడర్ గా హీరోయిన్ మీనాక్షి చౌదరిని నియమించారని సోషల్ మీడియాలో ప్రచారం పూర్తిగా ఫేక్. ప్రభుత్వం పేరుతో ఉద్దేశపూర్వకంగా ఇటువంటి తప్పుడు పోస్టులు పెడుతున్న వారిపైనా, ఫేక్ ప్రచారం చేస్తున్న వారిపైనా చట్టప్రకారం చర్యలు ఉంటాయి" అని ఏపీ ప్రభుత్వం తెలిపింది. నాడు తెలంగాణ చేనేత బ్రాండ్ అంబాసిడర్ గా నటి సమంత పనిచేసినట్లుగా, ఏపీలో పూనమ్ కౌర్ ఉన్నట్లుగా.. ఏపీ మహిళా సాధికారత బ్రాండ్ అంబాసిడర్ గా మరోసారి టాలీవుడ్ నటిని నియమించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించిందని విస్తృత ప్రచారం జరిగింది. తాజాగా దీనిపై క్లారిటీ వచ్చింది.



### కూతురును ఆకతాయిలు వేధించారని

## పోలీస్ స్టేషన్‌కు కేంద్ర మంత్రి

ఇక సామాన్య మహిళల పరిస్థితి ఏంటని మంత్రి విస్మయం

మహారాష్ట్రలో ఘటన.. సీఎంకు ఫోన్

వివరాలు 7లో



## ఎస్ఎల్‌బీసీ ప్రమాదానికి కేసీఆరే కారణం



### ఆయన నిర్లక్ష్యం వల్లే 8 మంది చనిపోయారు

వనపర్తి సభలో సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

పాలమూరును పసిడిపంటల జిల్లా చేస్తా

మోదీ మంచోడే.. కిషన్ రెడ్డే రాష్ట్ర అభివృద్ధికి విలన్

### మామునూరు ఎయిర్ పోర్టు మోదీ ఇస్తే.. మెట్రో 2 ఎందుకియ్యలే?

కిషన్ రెడ్డీ నీ బెదిరింపులకు భయపడం

వనపర్తిలో రూ. 550 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

మేఘారెడ్డి ఆధ్వర్యంలో సీఎంకు ఘనస్వాగతం

**వనపర్తి, మహా:** ఎస్ ఎల్ బిసి ఘటనలో 8మంది ప్రాణాలు కోల్పోవడానికి కేసీఆర్ కారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లాలోని స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన 'ప్రజాపాలనప్రగతి బాట' బహిరంగ సభలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీలపై తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలకు చలాకీ కాల్చి వాత పెట్టాలని, తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు.

మిగతా 2లో

### రోబోల సాయంతో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు

- టన్నెల్ వద్ద మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి
- సొరంగంలోకి వెళ్ళి సహాయకచర్యల పరిశీలన
- ఆపరేషన్ ఇబ్బందులు సీఎంకు వివరించిన రెస్క్యూ టీమ్

03



## 30 నెలల్లో వరంగల్ ఎయిర్ పోర్ట్

### ప్రజల చిరకాల వాంఛను పూర్తి చేశాం

ఎయిర్ పోర్టులు నిర్మించేది రాష్ట్ర ప్రభుత్వాలు కాదు

భూసేకరణ పూర్తి చేసి ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్రానిదే

తెలుగు ప్రజల మంత్రిగా పని చేయాలని చంద్రబాబు ఆదేశించారు

కొత్తగూడెం, రామగుండం, నిజామాబాద్‌లలో కొత్త ఎయిర్‌పోర్టులు నిర్మించేందుకు రెడీ

పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు



**హైదరాబాద్, మహా :** కేంద్ర ప్రభుత్వం కొత్తగా అనుమతించిన వరంగల్ ఎయిర్‌పోర్టును రాబోయే 30 మాసాల్లో పూర్తి చేస్తామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. హైదరాబాద్ లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, "వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్ట్ క్లియరెన్స్ ఇక్కడి ప్రజల చిరకాల వాంఛ. ఈ విమానాశ్రయం గతంలో ఆసియాలోనే అతిపెద్ద ఎయిర్‌పోర్టుగా ఉండేది. 1981 వరకు ఇక్కడి నుంచి రాకపోకలు కొనసాగుతుండేవని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి అయ్యాక విమానయాన రంగంలో ఓ విప్లవం మొదలైందని, పదేళ్లలో దేశంలోని ఎయిర్‌పోర్టుల సంఖ్య 79 నుంచి 150కి పెరిగిందని వివరించారు.

మిగతా 3లో

## హరీష్ దుబాయ్‌లో దావత్ చేసుకోలేదా?

- టన్నెల్ ప్రమాదం జరిగినపుడు ఎక్కడున్నాడు?
- మాజీమంత్రి హరీష్ పై సీఎం సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** ఎస్ ఎల్ బిసి టన్నెల్ ప్రమాదం జరిగినపుడు హరీష్ దుబాయ్‌లో దావత్ చేసుకోలేదా? ప్రమాదం జరిగినపుడు ఆయన ఎక్కడున్నారు? పాస్ పోర్ట్ ను ఒకసారి బయటపెట్టమనండి. కాదంటే నేనే బయటపెడతా అంటూ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎస్ ఎల్ బిసి పై హరీష్ చేసిన విమర్శలకు ఆయన స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ప్రమాదం తర్వాత రెండురోజులు ఆయన అబుదాబిలో మునిగి తేలలేదా? అంటూ ప్రశ్నించారు.

## ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై విచారణ జరిపించు

### మాజీమంత్రి హరీష్ రావు సవాల్

**హైదరాబాద్, మహా:** మీ రాజకీయ ప్రయోజనాల కోసం సాంకేతికపరమైన విషయాలు నిర్లక్ష్యం చేసి ఆదరబాదరగా ఎస్ఎల్బీసీ పనులు పరిగెత్తించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తెలిపారు. కార్మికులు వద్దని వారిస్తున్నా వినకుండా వారిని మృత్యు కుహరంలోకి నెట్టారు. వారి ప్రాణాలు బలి తీసుకొని ఇప్పుడు కుహనా ఏడ్పులు ఏడుస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రికి నిజాయితీ ఉంటే ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించు! దోషులు ఎవరో తేల్చు అని హరీశ్‌రావు సవాలు విసిరారు. పచ్చి అబద్ధాలు, పిచ్చి సెంటిమెంట్లు నోటికి వచ్చినట్టు కారు కూతలు బంద్ చెయ్ అని మండిపడ్డారు. ఒక్రితే పనులు కావు ఒళ్ళు వంచి పని చేస్తే పనులవుతాయని స్పష్టం చేశారు.



## ఈసారి తెలంగాణ బడ్జెట్ 3 లక్షల కోట్లు

- ఒకవైపు రాబడుల ఆశలు
- ఇంకోవైపు ఆదాయ లోటు
- వచ్చే ఆర్థిక సవంత్సర బడ్జెట్ అంచనాలపై ఆర్థిక శాఖ కసరత్తు
- అన్ని శాఖలతో ప్రీ బడ్జెట్ మీటింగ్స్ పూర్తి
- మార్చి మూడో వారం నుంచి బడ్జెట్ సమావేశాలు!

వివరాలు 2లో

### మంత్రి సీతక్క ఆధ్వర్యంలో.. లక్షమందితో

## మహిళా పండుగ

### మహిళాదినోత్సవాన 14 వేల ఉద్యోగాలు

**హైదరాబాద్, మహా:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో లక్ష మందితో సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు మంత్రి సీతక్క తెలిపారు. ఆ సభలోనే అంగన్‌వాడీ ఉద్యోగాలు విడుదల చేస్తామని తెలిపారు. దీంట్లో టీచర్ పోస్టులు 6,399, హెల్పర్ పోస్టులు 7,837 కలిపి 14,236 పోస్టుల భర్తీకి నియామక ప్రకటనను విడుదల చేస్తామని అన్నారు. దేశంలోనే అత్యుత్తమ మహిళా సాధికారత విధానాన్ని రూపొందిస్తామని సీతక్క తెలిపారు.



మిగతా 2లో

## కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ మధ్యలో బీఎస్పీ

### పట్టభద్రుల సీటులో గెలుపెవరిది?

- పెరిగిన ఓటింగ్ పర్సంటేజ్ ఎవరికి మేలు చేస్తుంది? ఎవరికి షాక్ ఇస్తుంది?
- త్రిముఖ పోరులో విజయం ఎవరిది

02



# 30 నెలల్లో వరంగల్ ఎయిర్ పోర్ట్

## ప్రజల చిరకాల వాంఛను పూర్తి చేశాం

ఎయిర్ పోర్టులు నిర్మించేది రాష్ట్ర ప్రభుత్వాలు కాదు

భూసేకరణ పూర్తి చేసి ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్రానిదే

తెలుగు ప్రజల మంత్రిగా పని చేయాలని చంద్రబాబు ఆదేశించారు

కొత్తగూడెం, రామగుండం, నిజామాబాద్‌లలో కొత్త ఎయిర్‌పోర్టులు నిర్మించేందుకు రెడీ

పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

(మొదటిపేజీ తరువాయి)

చిన్న చిన్న నగరాల్లోనూ ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేశామని, వరంగల్ వంటి నగరంలో ఎయిర్‌పోర్టు విషయంలో అడుగులు ముందుకుపడలేదన్నారు. తెలుగు ప్రజల మంత్రిగా పని చేయాలని చంద్రబాబు మార్గనిర్దేశం చేశారని, ఏపీ కోసం ఎలా పని చేస్తావో.. అదే చిత్తశుద్ధితో తెలంగాణ కోసం కూడా పనిచేయాలని సూచించారని మంత్రి పేర్కొన్నారు.

తెలంగాణలోనూ ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేయాలని కిషన్‌రెడ్డి సూచించారని, మామునూరు ఎయిర్‌పోర్టు క్లియరెన్స్ విషయంలో కొన్ని సమస్యలు వచ్చాయన్నారు. ఎయిర్‌పోర్టుకు 2800 మీటర్ల రన్‌వే అవసరమని, 280 ఎకరాలు అదనంగా భూసేకరణ అవసరమని కేంద్రం నుంచి ప్రతిపాదనలు గతంలోనే వచ్చాయని, గత ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేనందు వల్లే ఆలస్యమైందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరగా భూసేకరణ చేస్తే ఎయిర్‌పోర్టు పనులు వేగవంతం అవుతాయని, భూసేకరణ పూర్తయిన రెండున్నరేళ్లలో నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఎన్‌వోసీ తీసుకొని క్లియరెన్స్ ఇచ్చామన్నారు. భద్రాద్రి ఎయిర్‌పోర్టు విషయంలో గతంలో ఒక స్థలాన్ని ప్రతిపాదించారని, ఆ స్థలం ఫీజిబులిటీగా లేదని మంత్రి తేల్చి చెప్పారు. మరో స్థలం ప్రతిపాదించారని, భద్రాద్రి విషయంలో కొత్త స్థలంపై ఫీజిబులిటీని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

వరంగల్ ప్రజల చిరకాల కోరికను నా హయంలో క్లియరెన్స్ దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి ఆనందంతో తెలిపారు. వాస్తవానికి 1981 వరకు వరంగల్ ఎయిర్ పోర్ట్ లో కార్యక్రమాలు జరిగేవని, హైదరాబాద్ అభివృద్ధి జరగడంతో వరంగల్ ఎయిర్ పోర్ట్ లో కార్యక్రమాలు తగ్గిపోయాయన్నారు. తెలంగాణలో ఓకె ఒక్క ఎయిర్ పోర్ట్ మాత్రమే ఉందని, వరంగల్ ఎయిర్ పోర్ట్ క్లియరెన్స్ లో జాప్యానికి కారణాలు రెండున్నాయన్నారు. వరంగల్ ఎయిర్ పోర్ట్ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయడం జరిగిందని, టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు. ఎయిర్ పోర్ట్ ఏర్పాటుతో రియల్ ఎస్టేట్, ఉపాధి,అభివృద్ధి అవకాశాలు మెరుగుపడతాయని ఐంత్రి వివరించారు. వరంగల్ విద్యకు,




పర్యాటకానికి ప్రధానమైన నగరమని, ఎయిర్ పోర్ట్ నిర్మాణంతో దేశంలో ప్రధాన నగరాలతో వరంగల్ పోటీ పడగలదన్నారు.

**కేసీఆర్ సహకరించలేదు : కిషన్ రెడ్డి**

వరంగల్ లో ఏయిర్ పోర్టు నిర్మాణం చేయాలని చాలా రోజులుగా డిమాండ్ ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ప్రల డిమాండ్ కు అనుగుణంగా కేంద్రం ఎయిర్ పోర్ట్ ను నిర్మించేందుకు సుముఖత వ్యక్తం చేసి లేఖల రూపంలో చర్చలు జరిపిందన్నారు. గతంలో విమానయాన మంత్రిగా ఉన్న జ్యోతిరాధిత్య సింధియా స్వయంగా అప్పటి సిఎం కేసీఆర్ తో మాట్లాడారన్నారకు. అయినప్పటికీ సానుకూల స్పందన లేకపోవడంతో అనుమతుల్లో జాప్యం జరిగిందని పేర్కొన్నారు. వరంగల్ కు ఎయిర్ పోర్టు మంజూరు చేసినందుకు ప్రదాన మంత్రి నరేదంర్ మోడీకి తెలంగాణ ప్రజల తరపున కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి సీతక్క ఆధ్వర్యంలో..

# లక్షమందితో మహిళాపండుగ



(మొదటిపేజీ తరువాయి)

పలు రాష్ట్రాల్లో చేపట్టిన మహిళా సంక్షేమ కార్యక్రమాలపై అధ్యయనానికి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్, మహిళా సహకార అభివృద్ధి సంస్థ, తెలంగాణ సాంస్కృతిక సారథి, సంగీత నాటక అకాడమీల ఛైర్‌పర్సన్‌లు శారద, శోభారాణి, వెన్నెల, అలేఖ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, సంచాలకురాలు సృజన, సెర్ప్ సీఈఓ దివ్య, స్పెషల్ కమిషనర్ షఫీయుల్లాలు పాల్గొన్నారు.

### ఈ నెల8న నిర్వహించే కార్యక్రమాలు

- మహిళా సంఘాల ఆధ్వర్యంలో మొదటి విడతలో కొనుగోలు చేసిన 50 ఆర్టీసీ అద్దె బస్సులు ప్రారంభం చేయనున్నారు.
- 31 జిల్లాల్లో మహిళా సంఘాలతో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్ కంపెనీలతో ఒప్పందాలు.
- పేదరిక నిర్మూలన కోసం పురపాలికలు, గ్రామీణ ప్రాంతాల్లో వేర్వేరుగా పనిచేస్తున్న మెప్మా, సెర్ప్‌ల విలీన నిర్ణయ ప్రకటన.
- మహిళా ప్రాంగణాల్లో డ్రైవింగ్ శిక్షణ పొందిన మహిళలకు సబ్సిడీ ఆటోల పంపిణీ చేయనున్నారు.
- రాష్ట్రంలోని జిల్లాలో 64 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంట్లకు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు.

ఈసారి తెలంగాణ బడ్జెట్

# 3 లక్షల కోట్లు

**ఒకవైపు రాబడుల ఆశలు**

- ఇంకోవైపు ఆదాయ లోటు
- వచ్చే ఆర్థిక సవంత్సర బడ్జెట్ అంచనాలపై ఆర్థిక శాఖ కసరత్తు
- అన్ని శాఖలతో ప్రీ బడ్జెట్ మీటింగ్స్ పూర్తి
- మార్చి మూడో వారం నుంచి బడ్జెట్ సమావేశాలు!



**మహా:** ఒకవైపు భారీ రాబడుల ఆశలు.. ఇంకోవైపు ఆదాయ లోటుతో వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్ను అంచనా వేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తలమూనకలవుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అనుకున్నంత మేర ఆదాయం రాకపోవడంతో వచ్చే ఏడాదికి సంబంధించి అంచనాలపై తర్జనభర్జన పడుతున్నది. మొదటి ఏడాదిలోనే వివిధ రూపాల్లో రావాల్సిన ఆదాయం ఖజనాకు చేరకపోవడంతో ఈసారి బడ్జెట్ ఎంత ఉంటుంది? ఎక్కడెక్కడ కేటాయింపులు పెంచాలి? రాబడులకు ఉన్న అవకాశాలు ఏమిటనే దానిపై ఆర్థిక శాఖ దృష్టి సారించింది. మార్చి మూడో వారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. 202425లో రూ.2.91 లక్షల కోట్ల బడ్జెట్ను పెట్టగా.. ఈసారి రూ.3 లక్షల కోట్ల పైనే అంచనాలు రూపొందించే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తున్నది. ఐదారోజుల్లో సవరించే అంచనాలపై స్పష్టత రానుంది. దీంతో దానికి అనుగుణంగా బడ్జెట్ను రాష్ట్ర ఆర్థిక శాఖ తుదిరూపు ఇవ్వనుంది. అప్పులు, ఆదాయం అంతగా లేకుండా ఉన్న ఏపీ రూ.3.22 లక్షల కోట్ల భారీ బడ్జెట్ను పెట్టింది. దీంతో హైదరాబాద్ లాంటి భారీ ఆదాయం వచ్చే రాజధాని ఉండి.. భారీగా ఇన్కం జనరేట్ అయ్యే అవకాశాలు ఉన్న తెలంగాణ బడ్జెట్ కచ్చితంగా రూ.3 లక్షల కోట్లు దాటుతుందని సెక్రటేరియేట్ వర్గాలు చెప్తున్నాయి.

ఇప్పటికే దాదాపు అన్ని శాఖలతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రీబడ్జెట్ సమావేశాలు నిర్వహించారు. ఏయే శాఖలో ఎలాంటి పథకాలు ఉన్నాయి ? నిధులు ఎంత అవసరం పడుతాయి? ఇతరత్రా వంటి వాటిపై క్లారిటీకి వచ్చారు. కేంద్రం బడ్జెట్లోనూ తెలంగాణకు అంతగా నిధులు ఇవ్వలేదు. కేవలం పన్నుల వాటా, కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు, ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లు తప్ప వేరే సర్దుబాటు లేదు. కేంద్రం కూడా ఈసారి బడ్జెట్ ను గతం కంటే రూ.2.5 లక్షల కోట్లు మాత్రమే పెంచింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర బడ్జెట్ ఎంత ఉంటుందా అనే ఆసక్తి నెలకొన్నది.

**తప్పిన అంచనాలు..**
**కేంద్రం నుంచి అరకొరగానే నిధులు**

రాష్ట్ర ఆదాయం అంచనాల మేరకు రాలేదు. కనీసం రూ.45 వేల కోట్ల నుంచి రూ.50 వేల కోట్లు తనున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2.74 లక్షల కోట్ల రాబడి అంచనా వేసింది. అయితే 10 నెలల్లో అంచనాలు వేసిన దాంట్లో 66.57 శాతం అంటే రూ.1.82 లక్షల కోట్లు మాత్రమే వచ్చింది. మిగిలిన రెండు నెలల్లో ఇంకో 15 శాతం వచ్చినా దాదాపు 20 శాతం భారీ లోటు ఉంటుందని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. 202425కు సంబంధించి దాదాపు రూ.13 వేల కోట్లు సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీముల నుంచి రావాల్సి ఉండగా.. ఇప్పటి వరకు వచ్చింది రూ.6 వేల కోట్లు కూడా లేదని అధికారులు చెబుతున్నారు. కొన్నేండ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన పన్ను వాటాలు, ఇవ్వాల్సిన గ్రాంట్ ఇన్ ఎయిడ్‌లు ఆశించిన మేర రావడం లేదు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద రూ.21,636 కోట్లకు గాను రూ.5,176 కోట్లు మాత్రమే వచ్చింది. నాన్ టాక్స్ రెవెన్యూ కూడా రూ.35 వేల కోట్లకు రూ.5,866 కోట్లు వచ్చింది. ఈ రెండింటిలోనే ప్రభుత్వ ఖజనాకు రూ.46 వేల కోట్ల మేర లోటు ఏర్పడుతున్నది. అందులో భాగంగానే నాన్ టాక్స్ రెవెన్యూ పెంచుకునేందుకు ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేసింది.

చెడు పనులను గొప్పగా

# చూపించవద్దు

సినిమా రంగం బాధ్యతాయుతమైన మాధ్యమం

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

అలనాటి నిర్మాత కృష్ణవేణి సంస్మరణ సభలో ప్రసంగం



**మహా :** సినిమా అన్నది కేవలం వ్యాపారం మాత్రమే కాదని, ప్రజలను ప్రభావితం చేసే ఉన్నతమైన మాధ్యమం అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ఆదివారం ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ లో ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ నిర్వహించిన అలనాటి మహానటి, నిర్మాత, గాయని కృష్ణవేణి సంస్మరణ సభలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలనచిత్రాలు కళాత్మకంగా, సందేశాత్మకంగా ఉండాలని చెప్పారు. చెడు పనులను గొప్పగా చూపించేలా కథానాయకుల పాత్రలను రూపొందించటం సరి కాదన్నారు. సినిమాకు వెళితే సందేశం అందాలన్నారు. మానసిక ఉల్లాసం, సంతోషం కలగాలన్నారు. సినిమా రంగంలో ఉన్నత ప్రమాణాలు, ఉత్తమ సంప్రదాయాలు, మంచి భాష, హుందాతనానికి పెద్దపీట వేయవలసిన అవసరం ఉందన్నారు. భాష విషయంలోనూ నాటి దర్శక, నిర్మాతలు, రచయితల స్ఫూర్తిని సినీ రంగం అందిపుచ్చుకోవాలన్నారు. . ముఖ్యంగా ద్వంద్వార్థాలకు తావు లేని, హుందాతనంగా ఉండే భాషను వాడాలన్నారు. యువతరం సినిమా నుంచి ప్రభావితం అవుతారన్న అంశాన్ని దృష్టిలో పెట్టుకుని సినిమాల్లో జుగుప్సాకరమైన, అశ్లీల సన్నివేశాలకు తావు లేకుండా మంచి కథలను తెరకెక్కించాలని సూచించారు. వెగటు కలిగించే సన్నివేశాలు, ద్వంద్వార్థాలు లేకుంటే సినిమాలు ఆడవనే భ్రమ సరైనది కాదని సీతారామయ్య గారి మనవరాలు చిత్రానికి ముందు నుంచి... నిన్నటి “సీతారామం” వరకూ అనేక చిత్రాలు, అలాంటి సన్నివేశాలు లేకుండానే విజయం సాధించాయని చెప్పారు. సినిమాను, బాధ్యతాయుతమైన వ్యాపారంగా నాటి సినీ రంగ ప్రముఖులు అభివృద్ధి చేశారని, అలాంటి వారిలో కృష్ణవేణి వంటి వారు మొదటి వరుసలో నిలుస్తారని అన్నారు. నటిగా, గాయనిగా, నిర్మాతగా అనేక పార్శ్వాల్లో తమ ప్రతిభతో ఆకట్టుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి కృష్ణవేణి గారు అని చెప్పారు. 101 సంవత్సరాల పరిపూర్ణ జీవితాన్ని గడిపిన కృష్ణవేణి తెలుగు సినిమా ప్రారంభ దశ నుంచి... ఈరోజు ప్రపంచ స్థాయి వరకూ ఎదగడం వరకూ ప్రత్యక్ష సాక్షి అని పేర్కొన్నారు. తెలుగువారి ఆరాధ్య నటుడు ఎన్టీ రామారావు సహా ఎందరో ప్రతిభావంతులను సినీ రంగానికి కృష్ణవేణి పరిచయం చేశారన్నారు. కార్యక్రమంలో కృష్ణవేణి కుటుంబ సభ్యులు, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్ టి జనార్ధన్ గారు, ప్రముఖ సినీ నటుడు మురళీమోహన్, దివంగత ఎన్టీఆర్ తనయుడు రామకృష్ణ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



ఉగాది నుంచి

# గద్దర్ సినీ అవార్డులు

**మహా :** గద్దర్ సినీ అవార్డులకు సంబంధించి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు. ఈ అవార్డులను ఉగాది పండుగ నుంచి ఇవ్వబోతున్నట్లు వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం సినిమా కళాకారులను ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఎల్ బీ స్టేడియంలో నిర్వహించిన భక్త రామదాసు జయంతి వేడుకలకు హాజరైన భట్టి ప్రజా ప్రభుత్వం కళలను ప్రోత్సహిస్తుందని చెప్పారు. గత పదేళ్లు పాలించిన ప్రభుత్వం కళాకారులకు నంది అవార్డులు ఇవ్వలేదంటూ ప్రజా ప్రభుత్వం రాగానే సినిమా కళాకారులను ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకుందన్నారు. ఇందుకోసమే నంది అవార్డులకు గద్దర్ పేరు పెట్టామన్నారు. నాటక పోటీలను నిర్వహించి కళాకారులకు అవార్డులు ఇస్తామని చెప్పారు. తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతున్నట్లుగానే ఆధ్యాత్మికంగా కూడా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ఆశిస్తున్నారని చెప్పారు. సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల మాట్లాడుతూ, సీఎం సూచనల మేరకు భక్త రామదాసు 392వ జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ భక్త రామదాసు జయంతి ఉత్సవాల కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 26 సంగీత గాన బృందాలు తమ పేర్లను నమోదు చేసుకున్నాయని, ఇందులో 600 మందికి పైగా సంగీత కళాకారులు పాల్గొన్నట్లు తెలిపారు.

# కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ మధ్యలో బీఎస్పీ

## పట్టభద్రుల సీటులో గెలుపెవరిది?

**పెరిగిన ఓటింగ్ పర్సంటేజ్ ఎవరికి మేలు చేస్తుంది?**

**ఎవరికి షాక్ ఇస్తుంది? త్రిముఖ పోరులో విజయం ఎవరిది**



**మహా :** ఆరు నెలలుగా ప్రచారం. ఏడాది క్రితం నుంచి ఓటర్ల నమోదుపై ఫోకస్. ఎట్టకేలకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ అయిపోయింది. రిజల్ట్ మాత్రమే మిగిలి ఉంది. మరికొన్ని గంటల్లోనే బ్యాలెట్ బాక్సులు ఓపెన్ కానున్నాయి. రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగితే పట్టభద్రుల సీటు ఫలితం మాత్రం ఉత్కంఠ రేపుతోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటుగా స్వతంత్ర అభ్యర్థులు గెలుపుపై లెక్కలు వేసుకుంటున్నారు. సర్వేల అంచనాలు కూడా హీట్ క్రియేట్ చేస్తున్నాయి. బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్‌లలో ఉన్నాయి. కొన్ని గంటల్లో కౌంటింగ్ కు కౌంట్ డౌన్ స్టార్ట్ కానుంది. ఈ నేపథ్యంలో మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సీటు రిజల్ట్ ఉత్కంఠ రేపుతోంది. ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, బీఎస్పీ తరపున మాజీ అసిస్టెంట్స్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ, బీజేపీ నుంచి అంజిరెడ్డి పోటీపడ్డారు.

**అనూహ్యంగా ప్రధాన ప్రత్యర్థిగా మారిన డాక్టర్**

నామినేషన్లు పూర్తయ్యే నాటికి కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్యే పోటీ ఉంటుందని భావించినప్పటికీ బీఎస్పీ నుంచి బరిలో నిలిచిన డాక్టర్ ప్రసన్న హరికృష్ణ అనూహ్యంగా మిగతా ఇద్దరు క్యాండిడేట్లకు ప్రధాన ప్రత్యర్థిగా మారారు. రాష్ట్రంలో బీసీ నినాదం బలపడుతుండటం, చివరి మూడు నాలుగు రోజుల్లో బీఆర్ఎస్ లీడర్లు హరికృష్ణ కోసం పని చేయడం ఆయనకు ప్లస్ అయినట్లు తెలుస్తోంది.

**ఆ ముగ్గురి మధ్యే ప్రధాన పోరు**

ప్రతిష్ఠాత్మకంగా జరిగిన పోరును అన్ని పార్టీలు సవాల్ గా తీసుకోగా ఈ ముగ్గురు అభ్యర్థుల మధ్యే ప్రధానంగా ఎన్నికల పోరు జరిగింది. ఏకంగా కాంగ్రెస్ అభ్యర్థి తరపున సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ప్రచారం చేశారు. కాంగ్రెస్ తో ఢీ అంటే ఢీ అనే రీతిలో బీజేపీ క్యాంపెయిన్ చేసింది. కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, బీజేపీ ఎమ్మెల్యేలు.. అభ్యర్థి తరపున ప్రచారం నిర్వహించారు. బీఎస్పీ అభ్యర్థి ప్రస్నన్న హరిక్రిష్ణ ఒంటరిగా ఎన్నికల్లో పోరాటం చేయగా పోలింగ్‌కు మూడు నాలుగు రోజుల ముందు నుంచి బీఆర్ఎస్ పరోక్షంగా సపోర్టు చేసింది. ముగ్గురు అభ్యర్థులు గెలుపోటములపై లెక్కలు వేసుకుంటున్నారు. పోలైన ఓట్లలో తమకు వచ్చే ఓట్ల అంచనాలు వేసుకుంటూ ఎవరికి వారే గెలుపు ధీమాను వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ సర్కార్‌పై ఉన్న వ్యతిరేకత, హిందూ ప్రభావం, నిరుద్యోగులు, ఉద్యోగులు అండగా నిలబడుతారని బీజేపీ భావిస్తోంది. కానీ కమలం పార్టీని పోలింగ్ సరళి కలవరపెడుతోందట.

**ప్రసన్న హరికృష్ణతో కమలం పార్టీకి తీవ్రమైన నష్టం**

కమల విజయానికి ఏనుగు ఎదురెళ్లిందని పోలింగ్ సరళితో తేలిపోయిందట. పోల్ మేనేజ్‌మెంట్ చేసినా.. ప్రభుత్వ వ్యతిరేక ఓటర్లు బీజేపీ కంటే ప్రసన్న హరికృష్ణ వైపు మొగ్గు చూపారనే అంచనా వేస్తున్నారు. ప్రసన్న హరికృష్ణతో ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలో కమలం పార్టీకి తీవ్రమైన నష్టం జరిగిందన్న చర్చ జరుగుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్, బీఎస్పీ మధ్యే పోటీ అన్నట్లుగా ఓటింగ్ ప్యాటర్న్ కనిపించిందంటున్నారు. సర్కారు వ్యతిరేక ఓట్లు భారీగా చీలినప్పటికి ఆ ఓట్లు బీజేపీ కంటే బీఎస్పీకి లాభం చేశాయంటున్నారు. కేవలం సర్కార్ వ్యతిరేక ఓటే కాదు బీసీ వర్గాల ఓటర్లు కూడా ప్రసన్న హరికృష్ణకు పోలరైజ్ అయినట్లు జరుగుతున్న ప్రచారాన్ని.. బీజేపీ కొట్టి పారేస్తుంది.

**తన దగ్గర చదువుకున్న వారు, వారి పేరెంట్స్ సపోర్ట్ తో గెలుస్తాననే ధీమా**

ఇక కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి కరీంనగర్ వాసి కావడం గెలుపును ప్రభావితం చేసేలా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఓట్లు ఉండటంతో ఆయనకు బాగానే ఓట్లు పోలై ఉంటాయని హస్తం పార్టీ అంచనా వేస్తోంది. అందరి కంటే ముందే టికెట్ కన్ఫామ్ కాకపోయినా నరేందర్ రెడ్డి ప్రచారాన్ని మొదలు పెట్టి లక్షకుపైగా ఓటర్ ఎన్ రోల్ మెంట్ చేయించారు. ఆయన దగ్గర విద్యను అభ్యసించిన వారు, వారి పేరెంట్స్, కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు, సామాజిక వర్గం సపోర్ట్‌తో వచ్చిన ఓట్లతో విజయం సాధిస్తాననే ధీమాలో నరేందర్ రెడ్డి ఉన్నారు. కాంగ్రెస్ పుంజుకోవడానికి సీఎం రేవంత్ పర్యటన గేమ్‌ఛేంజర్‌గా మారిందంటున్నారు హస్తం పార్టీ నేతలు. నిజామాబాద్, మంచిర్యాల, కరీంనగర్‌లో రేవంత్ చేసిన ప్రచారంతో సమీకరణాలు మారిపోయాయంటున్నారు. సర్కారు వ్యతిరేక ఓటు చీలినా..పాజిటివ్ ఓటుతో గట్టెక్కుతామని అంటున్నారు కాంగ్రెస్ లీడర్లు.

**పెరిగిన ఓటింగ్ పర్సంటేజ్ తో ఎవరికి మేలు, ఎవరికి షాక్?**

ఇక బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ అభ్యర్థులతో పాటు మరో 53 మంది అభ్యర్థులు చీల్చే ఓట్లు అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశాలున్నాయి. గతంలో 59 శాతం పోలింగ్ అయితే ఈసారి 70.42 శాతం ఓటింగ్ జరిగింది. పెరిగిన ఓటింగ్ పర్సంటేజ్ ఎవరికి మేలు చేస్తుంది? ఎవరికి షాక్ ఇస్తుంది? అనేది ఆసక్తిగా మారింది. త్రిముఖ పోరులో ఎవరు విజయం సాధిస్తారనేది మరికొన్ని గంటల్లో కొంత స్పష్టత రానుంది.









# ఎస్ఎల్‌బీసీ ప్రమాదానికి కేసీఆరే కారణం

(మొదటిపేజీ తరువాయి)

వనపర్తి మాజీ ఎమ్మెల్యే ఇక్కడి రాజకీయాలను కలుషితం చేశారని అన్నారు..ఈ ప్రాంత అభివృద్ధి కోసం కాంగ్రెస్ నీటి ప్రాజెక్టులను కట్టిందని అన్నారు. వనపర్తిలో ధన రాజకీయం, కక్ష రాజకీయాలు ఉండేవి కావని రేవంత్ రెడ్డి అన్నారు. వనపర్తి విద్యార్థిగా తెలంగాణకు కీర్తి తెచ్చే విధంగా పని చేస్తానని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఏకమై రైతులను మభ్యపెట్టాలని చూస్తున్నాయని మండిపడ్డారు . రూ. 21కోట్ల రుణమాఫీ జరిగిందా లేదా రైతులను అడగాలని అన్నారు. రైతు భరోసా డబ్బులు రైతుల అకౌంట్లో వేశామని.. 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఆడబిడ్డలకు రూ. 500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని అన్నారు. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారని సీఎం రేవంత్ అన్నారు .

**కేసీఆర్ గ్రహణంతో డ్వాక్రా సంఘాలు నిర్వీర్యం**

కేసీఆర్ గ్రహణం పట్టి డ్వాక్రా సంఘాలు నిర్వీర్యమయ్యాని.. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసే ప్రయత్నం చేస్తున్నామని సీఎం అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నాయని అన్నారు. డ్వాక్రా సంఘాలకు శిల్పారామంలో మూడున్నర ఎకరాలు ఇచ్చామని.. 150 షాపులలో అక్కడ డ్వాక్రా మహిళల ఉత్పత్తులు విక్రయిస్తున్నారని అన్నారు. మహిళలు సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్రోత్సహిస్తున్నామని అన్నారు. ఆడబిడ్డలకు 4 లక్షల 50వేల ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేశామని అన్నారు. పదేళ్లలో కేసీఆర్ ఒక్క ప్రభుత్వ ఉద్యోగమైనా ఇచ్చారా అని ప్రశ్నించారు రేవంత్ రెడ్డి. ఏడాదిలో 55 వేల 163 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని.. ఎన్నో పనులు చేసిన తనను నువ్వు దిగుతావా లేదా అని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో కేసీఆర్ ఏనాడైనా పాలమూరు గురించి పట్టించుకున్నారా అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. కల్వకుర్తి ప్రాజెక్ట్ కేసీఆర్ ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు . . పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోఎస్ ఎల్ బిసి పనులు ఆగిపోవడం వల్లే టన్నెల్ కుప్పకూలిందని ఆరోపించారు. సొరంగంలో 8 మంది ప్రాణాలు పోవడానికి కేసీఆర్ కారణమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఆడబిడ్డలు ఆశీర్వదిస్తే మరో 15..20 ఏళ్లు సీఎంగా..**

ఆడబిడ్డలు ఆశీర్వదిస్తే రేవంత్‌రెడ్డి మరో 15.. 20ఏళ్లు సీఎంగా కాంగ్రెస్ అధికారంలో ఉంటే .. తమ బతుకు బస్టాండ్ అవుతుందని బీజేపీ, బీఆర్ ఎస్ నేతలు భయపడుతున్నారు. పదేళ్లుగా పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పండ బెట్టారని బీఆర్ఎస్ నేతలను అడుగుతున్నా. కృష్ణా జలాలను ఏపీ సర్కారు రాయలసీమకు కొల్లగొట్టుకు పోతుందంటే అందుకు కారణం కేసీఆర్. 811 టీఎంసీల్లో 511 టీఎంసీలు ఆంధ్రాకు తీసుకెళ్లండని కేసీఆర్ సంతకం పెట్టారు. ఆ సంతకమే ఇవాళ తెలంగాణ రైతాంగానికి శాపంగా మారింది. ఎస్ఎల్‌బీసీ పాపాల భైరవుడు కేసీఆర్ కాదా? పదేళ్లు భారాస పాలనలో ఎస్ఎల్‌బీసీ పనులు ఆగిపోవడం వల్లే కుప్పకూలింది. టన్నెల్‌లో 8మంది ప్రాణాలు పోవడానికి కారణం కేసీఆర్. కేసీఆర్‌ను నమ్మినందుకే పాలమూరు పడావు పడింది. అప్పుడే నన్ను దిగు.. దిగు అని కేటీఆర్, హరీశ్‌రావు, కవిత అంటున్నారు. పాలమూరు రైతు బిడ్డ సీఎం అయితే చూసి ఓర్వలేరా? కేసీఆర్.. మీరు ఏలడానికి పుడితే.. మేం బిచ్చమెత్తుకునేందుకు పుట్టామా? పాలమూరు ప్రజలకు తెలివితేటలు లేవా? మీ మాదిరిగా మేం చదువుకోలేదా?

**కిషన్‌రెడ్డి సైంధవుడిలా అడ్డు పడుతున్నారు**

మామునూరు ఎయిర్ పోర్టు ప్రధాని మోదీ ఇచ్చారు.. నేనే తెచ్చానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెబుతున్నారు. అదే నిజమైతే.. మెట్రో రాలేదు, ఆపింది మోదీనే కదా? మూసీ ప్రక్షాళనకు నిధులు రాలేదు.. ఆపింది మోదీనే కదా?. రీజినల్‌రింగ్ రోడ్డు ఉత్తరభాగం నేనే తెచ్చానని కిషన్‌రెడ్డి చెబుతున్నారు. దక్షిణ భాగం ఆగిపోయింది. ఆపింది మీరే కదా? పాలమూరు రంగారెడ్డికి 60 టీఎంసీల నీటి కేటాయింపులు పదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. ఆపింది మీరు కాదా? వస్తేనేమో ఆయన ఖాతాలో రాసుకుంటారు..రాకపోతే నే రేవంత్‌రెడ్డి ఏం చేయలేదంటారు. సికింద్రాబాద్‌లో వరద బాధితులకు కిషన్‌రెడ్డి ఏం చేశారు. నా కంటే చిన్నోడు రాష్ట్రానికి సీఎం అయ్యిండని కిషన్‌రెడ్డికి కడుపుమంట. కిషన్‌రెడ్డీ.. మీ దగ్గర మోదీ, ఈడీ, సీబీఐ ఉండొచ్చు. ఎంతకాలం ఈడీ, సీబీఐని చూపించి బెదిరిస్తారు? మేం ఎవరికీ భయపడం. మోదీ మనకు ఏదో ఒకటి చేయాలనే ఆలోచనలోనే ఉన్నారు. మోదీ చేయాలనుకున్నా.. కిషన్‌రెడ్డి సైంధవుడిలా అడ్డు పడుతున్నారు. తన రహస్య మిత్రుడు దిగిపోయాడని కిషన్‌రెడ్డి బాధపడుతున్నారు.'' అని సీఎం ప్రశ్నించారు.

## రూ.550 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

వనపర్తి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో రూ.550 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రం,మండలాల్లో రూ. 40 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణ పనులకు, నూతన ప్రభుత్వ ఆసుపత్రి భావన నిర్మాణానికి రూ.203.95 కోట్లతో,నూతన ఐటీ టవర్ భవన నిర్మాణానికి 22 కోట్లు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణాలకు రూ. 47.50 కోట్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్లు, 30 పడకల ఆస్పత్రి భావనము (సెబ్బేర్) నిర్మాణపు పనులకు రూ. 11.20 కోట్లు, శ్రీరంగాపూర్ ఆలయానికి పర్యాటకంగా అభివృద్ధి పరిచేందుకు 1.5 కోట్లు, వనపర్తి నియోజకవర్గంలో గిరిజన ఆవాసాల అభివృద్ధి పనులకు రూ. 22.67 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారు. దీనితోపాటు కాసిం నగర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం సమగ్ర సర్వే పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లు రవి, జిల్లా ఇన్చార్జి మరియు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్ మరియు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి, చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, వివిధ శాఖల రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు,జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తదితరులు పాల్గొన్నారు.









# రోబోల సాయంతో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు

## టన్నెల్ వద్ద మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి


### సొరంగంలోకి వెళ్ళి సహాయకచర్యల పరిశీలన

### ఆపరేషన్ ఇబ్బందులు సీఎంకు వివరించిన రెస్క్యూ టీమ్

**మహబూబ్ నగర్, మహా:** ఎలాంటి ప్రాణ నష్టం ఉండకూడదనే ఉద్దేశంతో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో మనుషులు, మిషిన్లతో పాటు అవసరమైతే రోబోల సాయం తీసుకునే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సొరంగంలో 8మంది గల్లంతైన నేపథ్యంలో సహాయక చర్యలను సీఎం, మంత్రులు టన్నెల్‌లోకి వెళ్లి స్వయంగా పరిశీలించారు. అనంతరం ఎస్ఎల్‌బీసీ వద్ద అన్ని విభాగాల అధికారులు, ఏజెన్సీలతో సహాయక చర్యలపై సమీక్షించారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. ''ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను 200506లో ప్రారంభించారు. 2014 తెలంగాణ ఏర్పడే నాటికి 32 కిలోమీటర్ల టన్నెల్ పూర్తయింది. కానీ, గత పదేళ్లుగా భారాస ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీని పట్టించుకోలేదు. ఈ పనులు చేస్తున్న సంస్థ విద్యుత్ బిల్లులు చెల్లించలేదని విద్యుత్ సరఫరా కూడా నిలిపివేశారు. దీంతో గత పదేళ్లుగా టన్నెల్ పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ ప్రాంతానికి కృష్ణా జలాలు అందించాలని నిర్ణయించాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రాజెక్టును పూర్తి చేయాలని.. ఆగిపోయిన పనులను తిరిగి ప్రారంభించాం. టన్నెల్ బోరింగ్ మిషన్‌కు కావాల్సిన విడి భాగాలను అమెరికా నుంచి తెప్పించి పనులు మొదలు పెట్టేలా చర్యలు తీసుకున్నాం. కానీ, అనుకోకుండా ఈ దుర్ఘటన జరిగింది.

**రాజకీయం కాదు.. బాధిత కుటుంబాలను ఆదుకోవాలి**

ప్రమాదాలు జరిగినప్పుడు రాజకీయాలు చేయడం కాదు.. బాధిత కుటుంబాలను ఆదుకోవాలి. విపత్తు సమయంలో జాతీయ స్థాయిలో నిపుణులైన 11 కేంద్ర సంస్థలు, ప్రైవేటు ఏజెన్సీలు 9 రోజులుగా సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నాయి. గల్లంతైన 8మంది ఆచూకీ ఇప్పటి వరకూ తెలియలేదు. ఈ ఆపరేషన్ కొలిక్కి రావడానికి మరో రెండు.. మూడ్రోజుల సమయం పడుతుందని అధికారుల సమీక్షలో తేలింది. కన్వేయర్ బెల్ట్ పాడవటం వల్ల సిల్టు తొలగించేందుకు ఆటంకమేర్పడింది. రేపు సాయంత్రానికి కన్వేయర్ బెల్ట్ అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు. మట్టి తీసిన తర్వాత మిషన్ తొలగించి, గల్లంతైన వారిని గుర్తించాల్సి ఉంటుంది. ఇలాంటి ప్రమాదంపై రాజకీయం చేయడం తగదు. సొరంగంలో గల్లంతైన కుటుంబాలకు అన్ని పార్టీలు అండగా ఉండాలి. మనో ధైర్యం కోల్పోలేదు.. మరింత పట్టుదలతో ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. టన్నెల్ పనుల్లో ఎలాంటి ప్రాణ నష్టం జరగకూడదనే ఉద్దేశంతో మనుషులు మిషిన్లతో పాటు అవసరమైతే రోబోలను వినియోగించాలని అధికారులను ఆదేశించా'' అని సీఎం తెలిపారు.



మహా పత్రిక
ANN తెలుగు
సోమవారం, 03-03-2025 | హైదరాబాద్


## మేధావులూ..

ఒక్క సారా చుక్కను నాలుకపై ఏసుకోరు
కపిసికెడు కల్లు గొంతులంగ దిగదు
నిద్ర మాత్రలు అస్సలు మింగరు
పెగ్గు మందును దగ్గరకి రానియ్యరు
అయినా మత్తులో తూలుతుంటరు
అది మేదో మత్తని కనబడకుండా జాగ్రత్త పడతరు
అయినా తామే మేధావులుగా నిలబడతారు

రంగులల్ల తమరంగువేరని
దంచి కొడుతుంటారు
జనాన్ని రంగుల రాట్నం ఎక్కించి తిప్పుతరు తల
తిరుగుతున్నట్లు చేస్తరు
ఏ రంగు కుర్చీలో ఉన్నారో అర్థం కాకుండా కసిబిసి
చేస్తరు
అయినా తామే మేధావులుగా నిలబడతారు

తాము నిలబడిందే భూమని
పైకి కనపడుతున్నదే ఆకాశం అని
రెంటినీ కలిపి కుట్టాలని కలలు అల్లుతారు కలల్లో
జనం గిలగిల కొడుతుంటే
ఉపశమన ఉపన్యాసాలు దంచుతుంటారు
అయినా తామే మేధావులుగా నిలబడుతారు

జనానికి ఏ కష్టం వచ్చినా
తాము రాసిన పుస్తకాలలో ఉపాయం ఉందని
ఊసగోడతరు
ఉపాయం ఏందో గాని ఉన్నది ఊడిపోతుంటది
అయినా తామే మేధావులుగా నిలబడతారు

నెత్తిమీద పుస్తకం
కుడి సంకలో పుస్తకం
ఎడమ సంకలో పుస్తకం
తన కూర్చున్న కుర్చీ కింద పుస్తకం
ఎదురుగా ఉన్న బల్ల మీద పుస్తకం
పుస్తకాల పురుగులై తొలుస్తుంటరు
కడుపు నిండనియ్యరు
గోసి మారనీయరు
అయినా తామే మేధావులుగా నిలబడతారు

అయ్యా మేధావులారా...
మీ మీ పంథాలకు పోకండ్రి
మీ ఆలోచనలు మీకు వుండనీయండి
మా వెనుకబాటుకు కారణం తెలుసుకోవడం
సూది మందును కనుక్కున్నంత
కష్టమేమీ కాదు
అన్ని జరాలకు ఒకటే మందు కాదు

గుడిసెల్లోకి తొంగి సూడుండ్రి
వాసాలదో కష్టం
కప్పు మీది గడ్డిదో కష్టం
తలుపుదో కష్టం దాని చిలుకు దో కష్టం
అన్నిటినీ నిలబెట్టిన నిట్టాడిదే పెద్ద కష్టం
దాన్ని నిలబెట్టుకుంటే చాలు
ఆ నిలబెట్టుకునే సూత్రం చెప్పుండ్రి
మిగతావి ఏ పాటి...

**- వహీద్ ఖాన్**

## యుద్ధం ముగిసాకె..

ఏదైనా
పని మొదలెడతానా
కంటిమీద నిదురుండదు

ఎవరితో వైరం వద్దనుకుంటాను
ఓపికను ఆసాంతం తెచ్చుకుని
నెమ్మది నెమ్మదిగానే
అడుగులేస్తూ పోతాను
మంచికీ చెడుకూ మధ్య
నలుగుతూనే
ధర్మం వైపు మొగ్గేందుకు
శతవిధాలా నాతోనే
కుస్తీ పడతాను

కాలాన్ని కలానికి చుట్టి
నేను అక్షర సాగర మథనమవుతాను
అంతుచిక్కని లోతుల్లోకి
రాక్షసఘన సమూహంలోకి
హృదయాన్ని నిలువునా చీలుస్తున్న
రంపపు కోతల్లోకీ
అమాంతం నెట్టివేయ బడతాను

దేనికీ దడవను
దేనికీ తలవొగ్గనూ
నన్ను నేను కాపాడుకునేందుకే
యుద్ధం మొదలు పెడతాను
ఎంత వద్దనుకున్నా
ఆయుధం అనివార్యమైతది

మొదలెట్టిన పని ముగియాలి
శత్రు సంహారం జరగాలి
ఒకే ధ్యేయం..ఒకే భావం
ఒకే వాదం..ఒకే వేదం
నిరంతర యోధుడినైపోతాను

ఎన్ని గాయాలైనా
నేలకొరగను..నీళ్లు తాగను
యుద్ధం ముగిసాకె..
దప్పిక తీరుతుంది
నిద్రకు ఉపక్రమిస్తాను..!

**- డా.కటుకోర్ఘ్వుల రమేష్**
సెల్:9949083327

## హృదయం చెక్కిన అక్షరం

మా పాదాలకు తొడిగిన చెప్పులు
కాలం చెల్లి అరుగుతూనే ఉన్నాయి!
మా ముందు తరాలకు
ఊతకర్రలు వారసత్వంగా
అందుతూనే ఉన్నాయి!.

అభద్రతా భావంతో
కప్పుకున్న నల్లని కంబళి
మా భుజాలు మోస్తూనే ఉన్నాయి!
దశాబ్దాలుగా నల్లని చీకటి
మా మురికి వాడని
కబలిస్తూనే ఉంది.

తరాలు మారుతున్నా!
మా చేతులకు తొడిగిన
బానిస సంకెళ్లు చూస్తూ
నట్టింట్లో చమురు దీపం
మినుకుమినుకుమంటూ వెలుగుతుంది.
తనకు తానుగా కాలిపోతూ,
అందని చమురు వైపు
దీనంగా చూస్తూ!.

గడప లోపల నేల
చిత్తడి చిత్తడిగా మారుతుంది.
వేదనతో ద్రవించే హృదయాన్ని
ఓదార్చలేని కన్నీటి చెమ్మతో!.

హృదయం కొత్తగా అక్షరాలు చెక్కుతుంది
మా పిల్లలు చేతుల్లో
పలకా బలపం ఒదిగిపోతుంది.
ఇప్పుడిప్పుడే మా పేటలో
అక్షర వెలుగులు సరికొత్తగా
ప్రసరిస్తున్నాయి.
చీకటి మెల్లిగా కనుమరుగవుతుంది...
మా చేతులను బందించిన
సంకెళ్లు తెగిపడుతున్నాయి.
స్వేచ్ఛా పవనాలు వీస్తుంటే.

**- రాము కోలా**
దెందుకూరు, ఖమ్మం.
9849001201.

## అరణ్య.. రోదనం!

ఎండిన ఆకులు నలుగుతూ..
నీ రాకకు నిరసన గొంతులవుతాయి

చెట్టున కొంగలు ఒక్కసారిగా
ఎగురుతూ..
నీలాకాశంలో బ్రేకింగ్ న్యూస్ లవుతాయి

తీతువు మా ప్రాణము తీతువా అంటూ ..
ఆ గొంతున దుఃఖగీతమౌతుంది

పొదలమాటు అలికిడి..
నీ ఖడ్గచాలనపు కళ్లకు చిక్కని
బెదిరే మూగచూపు

అక్కడి నిశ్శబ్ద మహావిలాపం
నీ తుప్పుపట్టిన చెవులకెక్కదు

ఆ మోదుగు పూరేకల
నెత్తుటి జీరల జ్వాలలూ
నీ మొద్దువారిన ఒంటినంటవు

నీ ముందు నడిచే నీ నల్లని నీడ
పాకినంత మేర
చెట్లు కూలుతున్న దృశ్యం

ఎప్పటినుంచో ఆ పచ్చనినేత్రం
ప్రతిఫలించే
గొడ్డలి ముఖం నీది

ఆ కొండ చెవిబిలం ప్రతిధ్వనించే
తుపాకీ గొట్టంగా నీవు

నిన్ను నువ్వు నిలూ నిస్సారం
పాతేసుకున్నా
చిగురించ నంత మోడువారావు

ఇప్పుడది
నీ నిఘంటువులో పొసగని మాట
నువ్వింక
మేలుకోవని తెలిసే తనజాగా ఖాళీ చేసి
అదెప్పుడో పారిపోయింది

నీ బతుకుపుస్తకం పేజీల్లోంచి
నెమలికన్నులా రాలిపోయింది

**- మడిపల్లి రాజ్‌కుమార్**
9949 699 215

## ప్రాయశ్చిత్తం కోసం...!

గాయానికి జాలి ఉండదు
ప్రార్థనలకు అది కరిగిపోదు
ఆక్రందనలకు మురిసిపోతది!

దాని సాన్నిహిత్యమంతా
వేటగానితోనే
జాలి దాని బద్ధ శత్రువు!

మన దుఃఖమే
దాని ప్రయాగ పుణ్యతీర్థ స్నానం
మన రోదనలే ప్రార్థన గీతాలు!

ఒక్క హృదయానికే తెలుసు
గాయం ఎంత దారుణమైందో
దుఃఖం కట్టలు తెంచుకుంటుంది!

మార్పు మంచిదే అనుకున్నాం
వేటగాని దాహం తీవ్రత ఏమిటో
కొత్త కొత్త గాయాలు గానం చేస్తున్నాయి!

అబద్ధాన్ని గట్టిగా చెబితే
నివద్దని నమ్మినందుకే
రోజుకో కొత్త గాయంతో ఊరేగుతున్నాం!

వైద్యం అందుబాటులోకి వచ్చేదాకా
కన్నీళ్లతో దుఃఖాన్ని ఆర్పుకుందాం
ప్రాయశ్చిత్తం కోసం నడుం బిగిద్దాం!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
9440233261


## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com | whatsapp- 9247580946

### పాత బంగారం - 2

# కళ్ళు

## కొమ్మూరి వేణుగోపాలరావు




తెలుగులో క్రైమ్ ఫిక్షన్ రాసిన రచయితలు చాలా తక్కువమంది. రాసిన వాళ్ళు కూడా కథలో హత్య, హంతకుడు ఎవరు అన్న దగ్గరే ఆగిపోయారు కాని క్రైమ్ నేపథ్యంలో రాసిన నవలలకు ప్రామాణికత ఉండేలా రచనలు చేయలేకపోయారు. అలాంటి తెలుగు సాహితీ వాతావరణంలో క్రైమ్ నవలలను ప్రస్తావించవలసిన సందర్భంలో కొమ్మూరి వేణుగోపాలరావు గారి "కళ్ళు" నవలను గుర్తు చేయవలసి వస్తుంది.

ఈ నవల స్వాతి వీక్లీలో సీరియల్‌గా వచ్చింది. పుస్తకంగా దీన్ని మొదట 1988లో ప్రచురించారు. రచయిత కొమ్మూరి వేణుగోపాలరావుగారు నిజంగానే మెడికల్ డాక్టర్. వీరిహౌస్సర్జన్, పెంకుటిల్లు నవలలు చాలామంది ఇష్టపడ్డారు. వీరి "ప్రేమకాంతి" తెలుగునవలల్లో నాకు చాలా ఇష్టమైనది. కాని "కళ్లు" గురించే నేను ప్రత్యేకంగా ప్రస్తావించాలనుకుంటున్నాను. ఎందుకంటే ఇది రచయిత క్రైం నేపద్యంలో రాసారు. కాని అవసరం ఉన్నచోటల్లా తన వైద్య పరిజ్ఞానాన్ని ఉపయోగించి కంటి ఆపరేషన్లు, కళ్లకు డాక్టర్లు చికిత్స చేసే విధానాన్ని, వాడే మందుల్ని, దానికి సంబంధించిన పరికరాలను చాలా విపులంగా చర్చించారు. ఈ చర్చకథతో ముడిపడి ఉంటుంది. అంటే కథలో పాత్రలు, ఆ సంఘటనలు కల్పితం కాని నవలలో ఈ కథలో జరిపిన వైద్య చర్చలన్నీ చాలా వరకు వాస్తవం. చదివే పాఠకులు కంటి డాక్టర్ల చికిత్సా విధానం, ఆపరేషన్ల గురించి కొంతవాస్తవిక సమాచారాన్ని పొందుతారు. అలాంటి ప్రయోగంతో తెలుగులో వచ్చిన నవలలు చాలా తక్కువ. క్రైం ఫిక్షన్ అంటేనే తెలుగు పాఠకులకు తక్కువ స్థాయి సాహిత్యం అనే ఆలోచన ఉంది. కాని ఈ జానర్ రాయడం అంత సులువు కాదు. మొదటి పేజీ నుండి చివరి దాకా ప్రేక్షకులలో ఆసక్తి చెడకుండాకథ చెప్పాలి. ప్రేక్షకులను ఎంతగా మాయ చేయగలిగితే ఆ నవల అంతగొప్ప థ్రిల్ ఇస్తుంది. రచయితశైలిలో ఎక్కడా తడబాటు ఉండకూడదు. ఎవరు దొంగో ముందే తెలిసిపోతే ఇక ఆ పుస్తకం చివరి దాకాఎవరూ చదవరూ. ఇన్నివిషయాలపై పట్టు సాధిస్తూ మళ్ళీ ఆ విషయ వస్తువుకు ప్రామాణికతను జోడించడం మామూలు ఆట కాదు. వీటన్నిటిని సాధించగలిగింది ఈ నవల. సీరియస్ సాహిత్యంవైపుకు పాఠకులను మెల్లగా దారి చూపగలిగేది ప్రామాణికతతో రాసిన క్రైం సాహిత్యమే. తెలుగులో అలాంటి సాహిత్యం తక్కువ అవడం పాఠకులు తగ్గిపోవడానికి కారణం కూడా. ఇది ప్రస్తుత తరం రచయితలు ఆలోచించాల్సిన విషయం.

ఇంగ్లీషులో ఇలాంటి వైద్యరంగ నేపథ్యంలో నవలలు రాసిన రాబిన్‌కు కూడా ఓ పిజీషియనే. అందుకే ఆయన నవలలు మెడికల్ రంగంలో ప్రామాణికమైనవి. తెలుగులో డాక్టర్ వృత్తిలో ఉంటూ ముప్పైపైగా రచనలు చేసిన కొమ్మూరి వేణూగోపాలరావు గారు కూడా తన నవలలో డాక్టర్ నేపథ్యాన్నే తీసుకుని వైద్య ప్రపంచాన్ని తెలుగు పాఠకులకు చేరువచేసారు. 'హౌస్ సర్జన్'లో ఆసుపత్రి డాక్టర్ల వెతలు, వారి అనుభవాలను మరో కోణంలో చూపించి డాక్టర్లను పాఠకులకు కొత్త దృక్కోణంలో పరిచయం చేసారు. 'కళ్ళు' నవలలో క్రైం ప్రధానంగా తీసుకుని కంటి డాక్టర్ల పని తీరు గురించి చర్చించడం మాత్రం ఓ గొప్ప ప్రయోగంగానే చెప్పుకోవాలి.

అందమైన కళ్ళున్న గొప్పింటి స్త్రీలను అపహరించివారి కళ్ళను పెకిలించేస్తూ ఉంటాడు ఓ ఉన్మాది. అతను ఎన్నుకునే స్త్రీలు అందమయినవాళ్ళే కాదు కళాకారులు కూడా. ఒకొక్కరిని ఎన్నుకుని వారి కళ్ళను ఓ డాక్టర్లా ఆపరేషన్ చేసి పెకిలించేసే ఈ ఉన్మాదిని పట్టుకోవాలని గట్టి నిర్ణయం తీసుకుంటుంది రంజిత అనే పోలీస్‌ఆ ఫీసర్.

ఈ నవలలో అపహరణకు గురయి కళ్ళు పోగొట్టుకునేది అందరూ స్త్రీలే. హంతకుడిని పట్టుకోవడానికి పూనుకుని రంగంలో దిగేది లేడీ పోలీస్ ఆఫీసర్, ఆమెకు పరోక్షంగా సహాయం చేసేది ఎస్.పి. కూతురు రసజ్ఞ. హంతకుడిని పట్టుకోవడంలో మనోజ్ఞ అనే మరో స్త్రీ కూడా సహాయం చేస్తుంది. ఈమె అంధురాలు. అంటే స్రీ పాత్రలను ప్రధానంగా తీసుకుని రాసిన సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. అలా ఆలోచిస్తే కూడా ఈ నవల తెలుగు సాహిత్యంలో ప్రత్యేకమైనది అనే చెప్పుకోవాలి.

అయితే మొదటి కిడ్నాప్ నుండి చివరికి నేరస్తులు పట్టుబడేదాకా ఈ కథలో పాత్రలకు చేసే ఆపరేషన్లు, కళ్ళకు సంబంధించిన వ్యాధులు, ఆపరేషన్ చేసేటప్పుడు మత్తుకోసం వాడే మందులు, ఇలాంటివన్నీ ఓ డాక్టర్‌గా కొమ్మూరి వేణుగోపాలరావు గారు ప్రామాణికమైన సమాచారంతో కథకు జోడించి కథను నడిపిస్తారు. వైద్యరంగంపై ఏ మాత్రం అవగాహన లేనివారికి ఈ నవల ఆ విధంగా ఎంతో సమాచారాన్ని ఇస్తుంది. ఈ నవలలో గమనించవలసిన మరో విషయం మహిళా పాత్రల పేర్లు. ఆ రోజుల్లో సరికొత్త పేర్లను ఏర్చి కూర్చి తన రచనలో ఉపయోగించే వారు రచయిత. అప్పటి ఓ ఇంటర్వ్యూలో తన దగ్గరకు వచ్చిన పేషెంట్ పేరుకొత్తగా ఉంటేదాన్ని నోట్చేసుకుని తన నవలా పాత్రలకు వాడుకునే వాడిని అని రచయిత చెప్పగా చదవడం నాకు గుర్తు. హేమసుధ, మందాకినీ, సంకేతిని, మాలినీదేవి, పద్మమాలిని, అశ్వినికుమార్, ప్రఫుల్‌కుమార్, వసంత్‌కుమార్, కృష్ణచైత్యన్య, అరుణ్ చైతన్య ఇలా అందమైన పేర్లు ఈ నవల నిండా కనిపిస్తాయి. రచయితలోని కవితాత్మకత ఈ పేర్ల ఎంపికలో పాఠకులకు అర్థం అవుతుంది. కొమ్మూరి వేణుగోపాలరావు గారిపై బెంగాలీ రచయిత శరత్ ప్రభావం ఉంది. అది ఈ పేర్ల ఎంపికలో కనిపిస్తుంది కూడ. చాలా పేర్లు బెంగాలీ వాతావరణానికి దగ్గరగాఉంటాయి.

పద్మనేత్రాలయం అనే హాస్పిటల్ నేపద్యంలో ఈ కథలో నడుస్తుంది. రచయిత హాస్పిటల్ సంబంధించిన ప్రతి పాత్ర పట్ల పాఠకులలో అనుమానం రేకెత్తిస్తారు. అందుకే ఒకే సిటింగ్లో ఈ నవల చదివేస్తాం. ఆఖరిపేజీ దాకా ఒకే రకమైన సస్పెన్స్ మెయింటెన్స్ చేయగలగడం క్రైం నవలకు అవసరం. రచయిత రచనా శైలి దానికి పూర్తి న్యాయం చేసిందని చెప్పవచ్చు. గడిచిన సంవత్సరాలలో కంటి చికిత్సలో ఎన్నోమార్పులు జరిగాయి. కేటరాట్ ఆపరేషన్లు, కంటిజబ్బులు కనుక్కునే పద్ధతిలో మార్పులు వచ్చాయి. అయినా ఈ నవల రాసిన కాలంలో వైద్యవిధానం ఎలా ఉండేదో ఈ పుస్తకం వివరంగా తెలియపరుస్తుంది. అలాగే డాక్టర్లు వాడే మందులను కూడా రచయిత ప్రస్తావించడంతోవైద్యరంగంపై ఆసక్తి ఉన్నవారందరికీ ఈ నవల ఆసక్తిదాయకంగా ఉంటుంది.

కాల్పనిక సాహిత్యంలో కల్పనే ప్రధానం. అయితేదానికి వాస్తవిక జీవనాన్ని ప్రామాణికంగా జోడించికథ చెప్పడంతో కథ పాఠకులను ప్రభావితం చేస్తుంది. అందుకే ఏ జానర్ రాసినా దానికి తగినంత రీసెర్చ్ రచయిత తప్పకుండా చేయాలి. పూర్తికాల్పనిక రచన ఆనందించడానికి పనికి వస్తుంది తప్పదాన్నిసీరియస్ సాహిత్యంగా తీసుకోలేము. కాని సస్పెన్స్ , క్రైం థ్రిల్లర్లలో కథ అవాస్తవిక మైనదానికి సంబంధించిన వాస్తవిక వివరణ ఆ పుస్తకాన్ని అమరం చేస్తుంది. కొన్నేళ్ళ తరువాత అది చదివినవారికి కూడా అదిఆసక్తిదాయకంగా ఉంటుంది. కాలం గడిచినకొద్దీ ఒకే విధమైన ఉత్సాహాన్ని, థ్రిల్‌ను నిలిపిఉంచుకోగలపుస్తకాలే మంచి రచనలు. ఆ రకంగా చూస్తే "కళ్ళు" క్రైం ఫిక్షన్అయినా తెలుగు సాహిత్యంలో ఇంకొన్ని దశాబ్దాల దాకా చదివేవారిని ఆకట్టుకో గల రచన. దీనికి కారణం అందులోని సస్పెన్స్ కాదు దాన్ని అంటిపెట్టుకుని ఉన్న ప్రామాణిక వివరణ.

ఈ నవలను ఇప్పటి తరం చదివి రీసెర్చ్ క్రైమ్ నవలల స్థాయిని ఎంత ఉన్నతం చేయగలదో అర్థం చేసుకుని ఈ జానర్‌ను సీరియస్‌గా తీసుకుని మంచి క్రైం నవలలు తెలుగులో తీసుకువచ్చే ప్రయత్నం చేయాలని ఆశిద్దాం. తెలుగులో మంచి సాహితీ ప్రయోగాలు జరిగాయి. కానివాటిని తరువాతి తరం రచయితలు పట్టించుకోకపోవడంతో రావలసినన్ని ఆసక్తిదాయకమైన పుస్తకాలు తెలుగులో రాలేకపోయానని, పాత నవలలను ఇప్పటికీ ఆనందంగా చదువుకునే మాలాంటి పాఠకులకు అనిపిస్తూ ఉంటుంది. నాదృష్టిలో తెలుగువా రి రాబిన్‌కు కొమ్మూరి వేణుగోపాలరాలవుగారు అనడం అతిశయోక్తి కాదు. క్రైమ్ జానర్లో ఆయన ఎక్కువ రాయకపోయినా రాసిన నవలల్లో తొంభైశాతం వైద్య ప్రపంచంతో సంబంధం ఉన్న పాత్రల ద్వారానే కథను నడిపించడానికి ఇష్టపడ్డ రచయిత ఆయన.

**- పి. జ్యోతి,** 9885384740

## ఒక శూన్యానంతరం!

నేను చూశాను
భూమిలోకి
తొలకరి జల్లుల్లో
విత్తు శవాసనం
తలెత్తుకోవాలని సహనగుణం
వేలమూల వేర్లు
లవణాల మూగ ఊర్లు కనిపించాయి నాకు

నేను చూశాను
నేలను
మొలకల కలలలోకం
కోటి ఊసుల పచ్చని పరిమళం
నీళ్ల చల్లదనం,
ఎండల వెచ్చదనంల యుగళం
వర్ణవర్ణ పూల వసంతం
పాకిన ఊడలు
పరుచుకున్న నీడలుకనిపించాయి నాకు

నేను చూశాను
నింగిలోకి
అనేక శాఖలు
శాఖలు శాఖలు
శాఖోపశాఖలు
వాటి సుతారపు ఉత్సాహాలఊయలలు
ప్రాణాన్నిచ్చే గాలి అలలు
ఆకాశం అందుకోవాలనే గడుసుఆశలు

చివరగా కళ్లుమూసుకుని
నేను చూశాను
నా మనసులోకి
అనేక ఆలోచనలచిక్కుముళ్ళను
దాటాక ఒక శూన్యానంతరం
త్యాగ భావం కనపడింది

కళ్లు తెరిచాను
మూగగా రమ్మని పిలిచే
తరువు కనపడింది నాకు.

**- రమేశ్ నల్లగొండ**
8309452179

## సఫల

బొడిగె రాళ్ళు,కంప ముళ్ళు,
మొరం, ఇసుక,ఇరుకు తొవ్వ
పురుగు, బూచి భయం
నడినెత్తి ఎండ, అరికాళ్ళ నడక

అలసట, దాహం,,అవమానం
ఒంటికి చుట్టుకొని,
ఎన్ని లక్షల యోజనాలు దాటానో
ఏ తీరు మజిలీలకు చేరానో

పరామర్శ, పునఃవిమర్శ ల్లేవు

అక్షరం, పదం, వాక్యం
సంపాయించుకున్నాను
ఒక నిత్య పరిమళ పుష్పం
సమాజానికి సమర్పించుకున్నాను
ఇక నిశ్చింత,
చాలునా...?

**- దాసరాజు రామారావు**
9618224503

## పక్షుల పాటలు

పక్షుల పాటలు హృదయం ఉప్పొంగినట్లు
ప్రకృతి చిగురుటాకులు తొడిగినట్లు
అక్కడక్కడ చెట్లకొమ్మలపై
రామచిలుకల గుంపులు, గోరువంకలు
పావురాల సమూహాలు
దారంతో అల్లిన ఒక పూలదండై
కళ్ళముందు కదలాడుతుంది సమూహం
ఎగిరిపోతున్న పిచుకలు, కాకులు
పావురాలకు అదొక అన్వేషణ యాత్ర
సాయంత్రానికి గూళ్ళకు చేరుతున్న
శ్రమజీవుల అపురూప మనోహర దృశ్యం

జీవితం అంటే ఒక పోరాటం..
ఆసక్తికరమైన అన్వేషణా పోరాటం..
మానవులకు అదొక
వినూత్నమైన సమూహయాత్ర పార్శ్వాంశం..

**- డా. అంజనా శ్రీ, ఖమ్మం**
భోనగిరి కోట, 7702537453

# డా.హసేన తదేక పరిశోధనా వ్యాసాలు

**రచయిత: డా. మహమ్మద్ హసేన.. సమీక్షకుడు: తంగిరాల చక్రవర్తి, 9393804472**




ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు, చక్కటి విలువైన ముందుమాట రాసారు. 21 వ్యాసాలున్నాయి. భానుశ్రీ కొత్వాతో సంపాదకత్వంలో వచ్చిన ''నాన్న'' కవితా సంకలనంపై రాసిన వ్యాసం బాగుంది. కవిత్వంలో ఒకనాడు ఆత్మాశ్రయం అధికకు గాని, నేటి కవిత్వంలో సామాజిక చైతన్యమే ఎక్కువ. (పేజీ.23) అంటారు రచయిత. అలాగే నవల గురించి రాస్తూ.. బౌద్ధిక ధర్మాన్ని కూడా పెంచుకోవడం వల్లనే మనస్తత్వ చిత్రణలకీ అస్తిత్వ వాదానికీ చైతన్య స్రవంతికి అవకాశం ఏర్పడింది అంటూ తనదైన అభిప్రాయాన్ని వెల్లడించడం విమర్శనకు చక్కటి బాట వేసారు. గోపాలక్రిష్ణ మశెట్టి ''శ్రీ రంగరాజ చరిత్ర'' తొలి తెలుగు నవలగా ఫోర్త్ సెయింట్ జార్జి గెజిట్ పేర్కొన్న అంశం రాసారు. ఇది వెలువడ్డ 6 సం. తర్వాత వీరేశలింగం గారి నవల రాజశేఖర చరిత్ర వివేక వర్ధినిలో ప్రచురితం అయింది. ఇది ఆంగ్లంలోకి అనువాదమైన తొలి నవలగా (ఫార్చున్ వీల్) చెప్పారు. శ్రీపాదవారి కథలు నవవికలు అనేలా ఉంటాయి. అన్నారు.. ఇలా విశ్లేషణ.. విమర్శన చేయడం చాలా కష్టం.. కథ../ వస్తువు/పాత్రలు/నేపథ్యం: అనే నాలుగు భాగాలు చాలా అవసరం నవలా రచనకు అంటారు. 52 కవితలున్న ఏనుగు నరసింహారెడ్డి చెప్పిన''కొత్త పలక'' గురించి సమీక్ష బాగుంది. ఫ్రీజోన్ (145): 610 జి.వో. లపై.. కవిత్వంతో చెప్పడం ''కొత్తపలక'' విశేషం. తెలంగాణ సాహిత్య చరిత్రను మదింపు చేసి ఒక రూపును తెచ్చిన ఘనత సుంకిరెడ్డి నారాయణ రెడ్డి గారిది. వారి ''తావు'' కావ్యాన్ని చక్కగా విశ్లేషించారు.

'సురాజ్యమవలేని స్వరాజ్యమెందులకని నిగ్గదీసి అడుగు ఈ సిగ్గు లేని జనాన్ని' అగ్గితోటి కడుగు ఈ సమాజ జీవచ్ఛవాన్ని'' అంటూ మనిషిని మేల్కొలిపే పాటలు వెనుక వచ్చే వాళ్లకు దారి అయినట్లు రాసిన విప్లవ అంకురం సిరివెన్నెలపై వ్యాసం చాలా బాగుంది. 1792లోనే స్త్రీల హక్కుల గురించి 'మేరీ హాల్ స్టోన్ క్రాఫ్ట్' విందినేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ విమెన్ గురించి 1980లో ప్రారంభమైన స్త్రీవాద తెలుగు కవిత్వం గూర్తి 93 మంది కవయిత్రులచే రాసిన ''నీలి మేషం'' గూర్చి విశ్లేషణ (పేజీ.59) బాగుంది. దళిత మైనార్టీ స్త్రీ వాద సాహిత్యంపై చలనాత్మక పరిశీలన (పేజీ.82) పొత్తి నవలపై విశ్లేషణ.

నవలలో ప్రధాన అంశాన్ని విశ్లేషిస్తూనే అలనాటి వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాలపై రాసిన సాహిత్యాన్ని సోదాహరణలతో చెప్పడం బాగుంది. కొండి మల్లారెడ్డి కవితా సంపుటి ''భిన్న రుతువు''పై సమీక్షలో మానవతా విలువలు కలిగి ఉండాలని సూచిస్తూ ''కంచెలు'' కేవలం మానవ నిర్మితాలు. అవి క్రుత్రిమంగా నిర్మించుకున్నవి అనడం బాగుంది. 'సామాజిక వైరుధ్యాల ధిక్కార స్వరం' జవేరియా కవిత్వం'పై రాస్తూ ఆమె కవితతో ''మాట్లాడలేని పూలుదీనంగా చూస్తూ/మౌనంగా రోదిస్తుంటాయి. అనడాన్ని జంధ్యాల పాపత్య శాస్త్రి పుష్ప విలాపం కార్యంలోని పద్యాలతో పోల్చి చెప్పడం బాగుంది. 'బిల్కిస్ బానో'పై బిళ్ళ మహేందర్ సంపాదకత్వంలోని సంఘీబావ కవితా సంకలనాన్ని అద్భుతంగా విశ్లేషించారు. వేటూరి పాటతో నిర్గుణ్ కవితను పోల్చి చెప్పడం బాగుంది. తిలక్ అమ్రుతం కురిసిన రాత్రి/దేవులపల్లి క్రిష్ణశాస్త్రి క్రిష్ణపక్షం/సినారె విశ్వంభర కావ్యాలపై రాసిన వ్యాసాలు వాటి విశ్లేషణ రేపటితరం సమీక్షకులకు.. విమర్శకులకు, చక్కటి మార్గదర్శకత్వంగా ఉంటాయి. తెలుగు ప్రభతో ప్రచురణైన ''తెలుగు సాహిత్యంపై అభ్యుదయ కవితోద్యమ ప్రభావ వ్యాసం చాలా విలువైనది. 1936 ఏప్రిల్ 9,10 తేదిల్లో లక్నోలో మున్షీ ప్రేంచంద్ అధ్యక్షతన అఖిల భారత అభ్యుదయ రచయిత ప్రథమ మహాసభలు జరిగాయి. అరసం ప్రభావంతో ఎందరో కవులు.. కథకులు, నాటకకర్తలు, నవలాకారులు, కళాకారులు ఎలా ముందుకొచ్చారో విశ్లేషించిన మంచి విలువైన వ్యాసం.. శేషేంద్ర గద్దర్‌లపై వ్యాసాలు మలికాస్త విశ్లేషణ .. రెండు పార్శ్వాలు (రెండు కోణాలు) రాస్తే సమగ్రత వచ్చి వుండేది. అంతర్జాతీయ ద్రుక్పథంతో మానవాభ్యుదయాన్ని కాంక్షించే కవిత్వం రావాలి అనే అంశం అందరూ ఆమోదించే అభిప్రాయమే. వేల్చేరు నారాయణరావు, లక్ష్మి నర్సయ్య, జి.వి. సుబ్రహ్మణ్యం, రోమల్లా థాసన్, బిపిన్ చంద్ర, డా.సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ఎస్వీ రామారావు లాంటి పెద్దలు రాసిన ప్రామాణిక గ్రంథాలే రేపటితరం కలం యోధులకు పెద్ద బాల శిక్షలు. ఓ మంచి ''తదేక'' విశ్లేషణగా గ్రంథ రచయిత హసేకు తెలంగాణపబ్లిషింగ్ హౌస్ వారికి అభినందనలు.

# కట్టుకోండి మేము ముట్టుకోము!

**కన్నెత్తి చూడని టౌన్ ప్లానింగ్, సంబంధిత అధికారులు**
**ఫిర్యాదులు అందిన పట్టించుకోని బల్దియా అధికారులు**

- కన్నెత్తి చూడని టౌన్ ప్లానింగ్, సంబంధిత అధికారులు
- ఫిర్యాదులు అందిన పట్టించుకోని బల్దియా అధికారులు



**వరంగల్, మహా;** గ్రేటర్ వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ పరిధి నుండి వరంగల్ చౌరస్తా వరకు, అలాగే 28వ డివిజన్లో మితిమీరిన అక్రమ కట్టడాలు విచ్చలవిడిగా నిర్మిస్తున్నారు. కొన్ని నిర్మాణాలు అనుమతులు పొంది ఒకలా అనుమతులు పొందకుండా మరోలా భవాన నిర్మాణాలు పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి సెట్ బ్యాక్ లేకుండా రోడ్డుపైనే భవనం నిర్మిస్తున్నారు. మరి కొన్ని చోట్ల జి ప్లస్ వన్ టు అనుమతులు పొంది మూడు లేక నాలుగు అంతస్తులు యెధేచ్ఛగా నిర్మిస్తున్నారు. మరికొన్ని చోట్ల నివాసానికి అనుమతులు తీసుకొని పక్కా కమర్షియల్ భవనాలను నిర్మించారు.. నిర్మిస్తున్నారు. దీంతో బల్దియాకు ఆదాయం నిల్.. అధికారుల నుండి సిబ్బంది వరకు ఆదాయం ఫుల్ గా హవా నడుస్తోంది. ముఖ్యంగా ఎనుమాముల మార్కెట్ పరిధిలో, అలాగే వరంగల్ చౌరస్తాలో 25, 27, 28 కమర్షియల్ భవన నిర్మాణానికి అనుమతులు తీసుకున్నారు. ప్లాన్ కు విరుద్ధంగా నిర్మాణం చేపట్టారు. నిబంధనల్ని పక్కన పెట్టి కార్పొరేటర్లకు పెద్ద మొత్తంలో తాయిలాలు ముట్ట చెప్పి వారి సహకారంతో అధికారుల నుండి సిబ్బంది వరకు యజమానులు వారికి కొంత ముట్ట చెప్పి భవన నిర్మాణాలు వారి ఇష్టానుసారం నిర్మించుకుంటున్నారు. ఈ క్రమంలోనే గతంతో వరంగల్ చౌరస్తాలో టౌన్ ప్లానింగ్ అధికారులు సరిగ్గా ఏడాది కిందట నోటీసు జారీ చేసి, స్వల్పంగా కూల్చేసి చేతులు దులుపుకున్నారు. వరంగల్ రోడ్డులోని ఓ థియేటర్, జేపీఎన్ రోడ్డు సమీపంలో ఉన్న భవనాలకు పత్రాలు పరిశీలించకుండానే ఇంటి నంబర్, పేరు మార్పిడి చేసి కమర్షియల్ కాంప్లెక్స్కు అనుమతులు ఇచ్చారని స్థానికులు చెబుతున్న మాట. దీని వెనుక కొందరు కార్పొరేటర్లు, ఓ కీలక ప్రజాప్రతినిధి రూ.లక్షలు గడించారన్న ఆరోపణలున్నాయి. ఇలా హనుమకొండ, కాజీపేట, వరంగల్ ట్రై సిటీలో కీలక రహదారులు, జంక్షన్లలో పదుల సంఖ్యలో అపార్ట్మెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్లు నిర్మిస్తున్నారు. టౌన్ ప్లానింగ్, అనుమతుల నిబంధనలు గాలికి వదిలేసి నిర్మాణాలు చేస్తూ బల్దియా ఆదాయానికి భారీ గండికొడుతున్నారు. ఈకీలక నిర్మాణాల వెనుక కొందరు కార్పొరేటర్లు, కీలక ప్రజాప్రతినిధులు, పాలకవర్గం పెద్దలు ఉండడంతో అటు అధికారులు, ఇటు సిబ్బంది నోరు మెదపడం లేదు.

**ఇదీ వసూళ్ల తీరు..**

వ్యక్తిగత నివాసం (అనుమతులు ఉన్నా, లేకున్నా) నిర్మించుకున్న కొందరు కార్పొరేటర్లు, వారి అనుచరుల ద్వారా రూ.10 వేల నుంచి రూ.30 వేలు ముక్కుపిండి వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. బల్దియా గ్రీవెన్స్ లోనూ ఇటీవల కొందరు బాధితులు ఫిర్యాదు చేశారు. అయినా ఎటువంటి ప్రయోజనం లేదని బాధితులు వాపోతున్నారు.
* అపార్ట్మెంట్ (బిల్డర్ నిర్మిస్తే) నిర్మిస్తే చాలు. కనీసం రూ. లక్ష నుంచి రూ.2 లక్షలు ముట్టజెప్పాల్సిందే. ఇది చాలా డివిజన్లలో ఒక రూల్ లాగా మార్చేశారు. బహుళ అంతస్తుల భవనంలో ఒక అంతస్తు అదనంగా నిర్మిస్తే దాదాపు రూ.5 వేల నుంచి రూ. లక్ష నజరానా చెల్లించాల్సిందే.! లేదంటే టౌన్ప్లానింగ్ అధికారులను మధ్యన పెట్టి కొందరు కార్పొరేటర్లు పనులు ఆపేసిన ఫిర్యాదులు కూడా ఉన్నాయి. ఇవే కాకుండా.. ఆయా డివిజన్లలో ప్రాతి నిథ్యం వహించే కార్పొరేటర్.. పార్టీ చేపట్టే కార్యక్రమాలు, సమావేశాలు, సభలు, నిరసన కార్యక్రమాలు, పండుగలకు ప్రత్యేక ప్యాకేజీలు ఇవ్వాలంటూ ఒత్తిళ్లు కూడా చేస్తున్నారని స్థానిక ప్రజలు చెబుతున్నారు.
* భవన నిర్మాణానికి అనుమతి లేకపోతే ఆ ఏరి యా కార్పొరేటర్కు కాసులు కురిసినట్లే. జీ ప్లస్ 2, 3, 4కు రూ.20వేల నుంచి రూ.60వేల వరకు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందని కొందరు భవన నిర్మాణదారులు బహిరంగంగా చెబుతున్నారు.

**మికింత.. మాకెంత?**

'తమ్ముడు తమ్ముడే.. పేకాట పేకాటే..' అన్న రీతిగా గ్రేటర్ వరంగల్ లోని.. నా అనే తారతమ్యం లేకుండా కొందరు కార్పొరేటర్ల వసూళ్లు కొనసాగుతున్నాయి. కొన్ని డివిజన్లో ఒక డివిజన్ కార్పొరేటర్ మరొక డివిజన్లో వాళ్ళ బంధువుల ఇంటి అక్రమ నిర్మాణం చేపట్టడం మరో విశేషం. ఫలితంగా నగరంలో రోజురోజుకూ అక్రమ భవన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. తనకు తెలిసిన వారైనా, బంధువులు ఇల్లు కట్టిన, అపార్ట్మెంట్ నిర్మించినా, అక్రమమైనా.. నిబంధనలు అతిక్రమించినా.. ఏదైనా సరే. భవన నిర్మాణాల ఫొటోలు తీస్తున్నారు. అధికారుల తరహాలో బిల్డింగ్ పర్మిషన్ తీసుకురమ్మని బెదిరిస్తున్నారు. లోకల్ కార్పొరేటర్, బిల్డింగ్ ఇన్స్పెక్టర్లతో మాట్లాడుకోవాలని సలహా ఇస్తున్నారు. కూల్చేస్తే ఏమొస్తుందని భయ భ్రాంతులకు గురిచేస్తున్నారు. గ్రేటర్ వరంగల్ టౌన్ ప్లానింగ్ చైర్మెన్లు, శానిటరీ జవాన్లు, డివిజన్లలో చోటా, మోటా అధికార పార్టీ నాయకులు చివరికి బిల్ కలెక్టర్లు కూడా వసూళ్ల రాయుళ్లుగా మారారని జనం కోడై కూస్తున్నారు. ఇప్పటికైనా ఇన్చార్జి సిటీ ప్లానర్, టౌన్ ప్లానింగ్, ఏసిపి లు స్పందించి భవన నిర్మాణాలను క్షుణ్ణంగా పర్యవేక్షించి అక్రమ, ఆక్రమణ నిర్మాణాలకు చెక్ పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా సామాన్య ప్రజలు నిర్భయంగా ఇండ్లు నిర్మించుకునేలా వారికి సహకరించాలని, పెద్దవాళ్ళకు ఓ న్యాయం, డబ్బులు ఇచ్చుకోలేని పేదవారికి ఓ న్యాయం ఉండకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## పారిశుద్ధ్య నిర్వహణ పనులను తనిఖీ చేసిన కమిషనర్



**వరంగల్, మహా;** గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ .అశ్విని తానాజీ వాకడే అన్నారు.నగర పరిధి లో కొనసాగుతున్న శానిటేషన్ నిర్వహణ పనులను బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఉ.5 గంటల ప్రాంతంలో హన్మకొండ ప్రాంతంలో ఆకస్మికంగా తనిఖీలు చేసి సిబ్బంది అటెండెన్స్ ను క్షేత్ర స్థాయి లో పరిశీలించారు. బల్దియా పరిధి లోని 3వ డివిజన్ తో పాటు హన్మకొండ అశోక జంక్షన్, అంబేద్కర్ జంక్షన్ ప్రధాన రహదారి ప్రాంతం లో శానిటేషన్ తీరును పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ చెత్త తరలింపు చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ నిర్వహిస్తున్న లాగ్ బుక్ ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధాన రహదారిని శుభ్రం చేసే స్వీపింగ్ మిషన్ ల సంబంధిత లాగ్ బుక్ పరిశీలించి ఎన్ని కిలోమీటరు లు శుభ్రం చేశారో డ్రైవర్ లను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు పారిశుధ్య సిబ్బంది వారికి కేటాయించిన పరిధి తో పాటు ఆరోగ్య పరిస్థితులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కమిషనర్ సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో ఎం హెచ్ ఓ డాక్టర్ రాజేష్, శానిటరీ ఇన్స్పెక్టర్ లు అనిల్, నిరంజన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



**మోత్కూరు,మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం తొర్రూరువలిగొండ ప్రధాన రహదారిలో పాటిమట్ల స్టేజి, కంచనపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని డెడ్‌బాడీ కనిపించడం కలకలం రేపుతోంది. స్థానికులు ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. మృతదేహం పడిన తీరును గమనించిన స్థానికులు, గుర్తు తెలియని వాహనం ఢీకొని ప్రమాదం జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. అయితే మరికొందరు ఈ ఘటన అనుమానాస్పదంగా ఉందని, అభిప్రాయపడుతున్నారు. మృతుడు యూపీ రాష్ట్రానికి చెందిన కార్మికుడై ఉండొచ్చని అంటున్నారు.మృతుడి పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, పూర్తి వివరాలను తెలుసుకునే పనిలో ఉన్నారు. ఈ ఘటనపై పూర్తి సమాచారం త్వరలో వెల్లడి కానుంది. పోలీసుల దర్యాప్తులో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది

## జర్నలిస్టుల ఇండ్ల స్థలాల పంపిణీ ప్రక్రియ వెంటనే చేపట్టాలి



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు పేరుకు మాత్రమే ఇండ్ల స్థలాల పట్టాలు ఇచ్చి పంపిణీకి నోచుకోకపోవడం చాలా బాధాకరం అన్నారు. ప్రభుత్వం వెంటనే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయిస్తూ పంపిణి కి శ్రీకారం చుట్టాలన్నారు. ఇందిరమ్మ గృహ పథకం కింద జర్నలిస్టులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ గుండాల మండల అధ్యక్షులు సూరారపు నరేష్, ప్రధాన కార్యదర్శి సుదగాని హరికృష్ణ గౌడ్, మండల కార్యవర్గ సభ్యులు పగడాల అంబదాస్ నేత పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీపాదరావు జయంతి వేడుకలు



**వరంగల్, మహా;** గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 88వ జయంతి వేడుకలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్య అతిధిగా పాల్గొని శ్రీపాదరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. శ్రీపాదరావు కు నివాళ్లు అర్పించిన వారిలో అదనపు డీసీపీ రవితో పాటు ఏసీపీ లు, ఆర్.ఐలు, ఇన్స్ స్పెక్టర్లు ఆర్.ఎస్.ఐ, ఇతర పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.


## పద్మశాలి కళామ్మ తల్లి ముద్దుబిడ్డలకు ఘన సన్మానం



**హనుమకొండ, మహా:** హన్మకొండ ధీ వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ వన్నాల శ్రీరాములు ఆధ్వర్యం లో పద్మశాలి కవులు, రచయితలు, కళాకారులు వివిధ రంగాలలో జాతీయ అంతర్జాతీయ వేదికల పై అవార్డులు అందుకున్న వారిని ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా బండ ప్రకాష్ శాసన మండలి డిప్యూటీ చైర్మన్, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు తో కలిసి అతిరథ మహారథులు చేతుల మీదుగా బాబా సాహెబ్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు అందుకున్న సందర్భంగా ఘన సన్మానం అందుకున్న చిప్ప వెంకటేశ్వర్లు నేత టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, బాబాసాహెబ్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత 23 వ డివిజన్ కంటెస్టెంట్స్ కార్పొరేటర్ తో పాటు ముఖ్య నాయకులు నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# నేడే కౌంటింగ్

- పట్టభద్రులు .టీచర్ల తీర్పు
- ఆ ముగ్గురు అదృష్టవంతులు ఎవరు.?
- శాసన మండలి లో అడుగు పెట్టేదెవరు.?
- మొదటి ప్రాధాన్యతలో తేలేనా..?
- ఎలిమినేషన్ ప్రక్రియ తప్పదా.?
- టెన్షన్ ..టెన్షన్



**మహా ప్రత్యేకం :** ఫిబ్రవరి 28న జరిగిన ఉమ్మడి కరీంనగర్ , ఆదిలాబాద్ , నిజామాబాద్ , మెదక్ జిల్లాల పట్టభద్రులు , ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంతో పాటు వరంగల్,ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ స్థానానికి జరిగిన ఎన్నికలలో ఓటరు తీర్పు నేడే వెలువడనుంది. నేడు ఉదయం 8 గంటలకు మొదలయ్యే కౌంటింగ్ ఫలితాన్ని బట్టి ఒకవేళ మొదటి ప్రాధాన్యత ఓటుతో విజేత తేలక పోతే కౌంటింగ్ రెండో రోజు వరకు కూడా కొనసాగే అవకాశముంది.అందుకే మూడు షిఫ్టుల్లో కౌంటింగ్ నిర్వహించనున్నారు. గ్రాడ్యుయేట్ ఓట్ల కోసం మొత్తం 21 టేబుళ్లు, టీచర్స్ ఓట్ల కోసం 14 టేబుళ్ళు సిద్ధం చేసారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 56 మంది అభ్యర్థులు పోటీలో నిలవడంతో జంబో బ్యాలెట్ వినియోగించారు. కౌంటింగ్ ప్రక్రియ కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా తొలుత మొత్తం పోలైన ఓట్లను క్షుణ్ణంగా పరిశీలించి రిజెక్ట్ అయిన ఓట్లను పక్కన పెట్టి కేవలం చెల్లుబాటు అయిన ఓట్లను మాత్రమే లెక్కలోకి తీసుకుంటారు. మొదటి ప్రాధాన్యతా ఓటు ప్రకారం చెల్లుబాటు అయిన మొత్తం ఓట్ల సంఖ్యలో సగాని కంటే ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా సదరు అభ్యర్థినే విజేతగా ప్రకటిస్తారు. ఉదాహరణకు పట్టభద్రుల ఓట్ల మొత్తాన్ని తీసుకుంటే మొత్తం 3 లక్షల 55 వేల 159 మంది ఓటర్లు ఉండగా 2 లక్షల 50 వేల 328 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో ఒకవేళ రెండు లక్షల ఓట్లే చెల్లుబాటు అయినవి అనుకుంటే లక్ష ప్లస్ సాధించిన వ్యక్తి విజేత అవుతాడు.ఇక ఉమ్మడి కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో ఓట్లు మొత్తం 27వేల 88 కాగా 24వేల 968 మంది టీచర్స్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.ఒకవేళ 24 వేలే చెల్లితే 12వేలు ప్లస్ ఓట్లు సాధించిన వ్యక్తి విజేతగా నిలుస్తాడు.

**ఎలిమినేషన్ ప్రక్రియ..**

మొత్తం లెక్కించిన మొదటి ప్రాధాన్యతా ఓట్లలో ఏ అభ్యర్థికి సగం ప్లస్ ఓట్లు రాక పోతే ఎలిమినేషన్ ప్రక్రియ చేపడతారు. ఇందులో మొదటి ప్రాధాన్యత ఓట్లు సాధించిన సంఖ్యను బట్టి ఆరోహణ క్రమంలో (కింది నుండి పైకి ) ఒక జాబితాను సిద్ధం చేస్తారు. ఈ లిస్ట్ లో అన్ని ప్రాధాన్యత ఓట్లు లెక్కించినా గెలుపు మార్కు చేరుకోలేనంత తక్కువ ఓట్లతో చిట్ట చివరి స్థానం నుండి అభ్యర్థులను గుర్తించి వరుసగా ఎలిమినేట్ చేస్తారు.ఇలా ఆరోహణా క్రమంలో రెండో ప్రాధాన్యతా ఓట్లను లెక్కిస్తూ ఆ సంఖ్యను అభ్యర్థుల ఓట్లకు జమచేస్తూ చివరి అభ్యర్థులను ఎలిమినేట్ చేస్తూ వస్తుంటారు. ఇలా ఒకవేళ రెండో ప్రాధాన్యతా ఓట్లు కలిపి లెక్కించినా విజయానికి కావల్సిన సంఖ్య సగం ప్లస్ ఓట్లను ఏ అభ్యర్థి అందుకోకపోతే మూడో ప్రాధాన్యత ఓట్లను తీసుకుంటారు. ఇలా అభ్యర్థుల్లో ఎవరో ఒకరికి విజయం దక్కేవరకు ఓట్లు యాడ్ చేసుకుంటూ చివరి వరుసలో ఉన్నవారిని ఎలిమినేట్ చేస్తుంటారు. అందుకే పట్టభద్రుల ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలో ప్రాధాన్యత ఓట్లు ఎంతో కీలకం

**అభ్యర్థుల్లో టెన్షన్..**

ఉమ్మడి కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో ఈ సారి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడుతున్నా ప్రధానంగా పోటీ మాత్రం అధికార పార్టీ కాంగ్రెస్ బలపరిచిన వుట్కూరి నరేందర్ రెడ్డి, బిజెపి నుంచి చిన్నమైల్ అంజిరెడ్డి, బిఎస్పీ అభ్యర్థిగా బరిలో దిగిన పులి ప్రసన్న హరికృష్ణగౌడ్ ల మధ్యే ఉండనుంది. అటు ఉమ్మడి కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 15 మంది అభ్యర్థులు పోటీ చేయగా గెలుపుపై ఎవరికి వారే ధీమాను వ్యక్తం చేస్తున్నారు. అయితే బీజేపీ నుంచి మల్క కొమురయ్య, పీఆర్టీయు నుండి వంగ మహేందర్ రెడ్డి, యుటిఎఫ్ అభ్యర్థిగా వై.అశోక్ కుమార్, సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి ల మధ్యే ప్రధాన పోటీ ఉండనుంది. మరోవైపు ఉమ్మడి నల్లగొండ ఖమ్మం వరంగల్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో మొత్తం 19 మంది అభ్యర్థులున్నారు.ఇక్కడ బీజేపీ అభ్యర్థిగా సర్వోత్తమరెడ్డి బరిలో ఉన్నా ప్రధానంగా ఉపాధ్యాయ సంఘాల మధ్యే పోటీ ఉండనుంది. యూటీఎఫ్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి , టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాలిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి , పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్ రెడ్డి, బీసీ సంఘాల మద్దతుతో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ ల మధ్య పోటీ నెలకొంది.

## 30 లక్షలతో ఉడాయించిన ఏటీఎం దొంగలు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా:** ఏటీఎం చోరీ చేసి రూ.30లక్షలు ఎత్తుకెళ్లిన ఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బ్యాంక్ మేనేజర్ శ్రీవాణి తెలిపిన వివరాల ప్రకారం ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని, రావిర్యాల గ్రామంలో శనివారం రాత్రి ఎస్బిఐ ఏటీఎం చోరీకి గురైందని అన్నారు. మహేశ్వరం మండలం రావిరాల గ్రామంలో 2012లో ఎస్బిఐ బ్రాంచ్ ఏర్పాటు చేయడం జరిగినది అన్నారు. ప్రస్తుతం బ్యాంకు మేనేజర్ గా శ్రీవాణి విధులు నిర్వహిస్తున్నారు. ఆమె ఆదిభట్ల పోలీస్ స్టేషన్ లో జరిగిన ఘటనపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఓ కారులో వచ్చిన గుర్తుతెలియని నలుగురు దుండగులు ముందుగా సీసీ కెమెరాలకు ధ్వంసం చేసి, ఎమర్జెన్సీ సైరన్ మోగకుండా సెన్సార్ వైర్లను కట్ చేశారు. కట్టర్, ఇనుప రాడ్ల సహాయంతో ఏటీఎంను పగలకొట్టి సుమారు 30 లక్షలు వరకు డబ్బులు తీసుకొని పరారయ్యారని తెలిపారు. ఈ సమాచారం అందుకున్న ఆదిభట్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఏటీఎంను పరిశీలించారు. మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి, ఏసీపీ కేవీపీ రాజు ఆదేశాలతో, చోరీ చేసిన దుండగుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు ఆదిభట్ల సీఐ రాఘవేందర్ రెడ్డి వెల్లడించారు. సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలతో దుండగులను గుర్తించి, త్వరలోనే దొంగలను పట్టుకుంటామని తెలిపారు.

# ప్రభుత్వ భూమి యధేచ్ఛగా కబ్జా

**కబ్జా భూముల్లో చేపల చెరువులు**
**చర్యలు తీసుకోవాలని గిరిజన రైతుల డిమాండ్**



**మహబూబాబాద్ జిల్లామహా:** గిరిజన రైతులు ప్రభుత్వ భూమి కబ్జా చేసిన వారి పై చర్యలు చేపట్టాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా గిరిజన రైతు నాగార్జున మాట్లాడుతూ... సౌల తండాలో గత ప్రభుత్వ హయాంలో గిరిజనులకు రెండు పడక గదుల నిర్మాణానికి 6 ఎకరాల 10 గుంటల ప్రభుత్వ భూమిని తండాలోని గిరిజనులకు కేటాయించారని ఆ భూమిని యథేచ్ఛగా కబ్జా చేసి చేపల చెరువును ఏర్పాటు చేసుకోవడమే గాకుండా తండాల్లోని మహిళలు బహిర్భూమికి వెళ్లకుండా ఆ ప్రాంతంలో సీ.సీ.కేమేరాలు ఏర్పాటు చేసి భూ కబ్జా దారులు మహిళలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ చెరువుల్లోని విద్యుత్ మోటార్లను వినియోగించి నిరంతరాయంగా నీటిని తోడి చేపల చెరువును నింపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అదికారులు అక్రమార్కులకు అండగా నిలబడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూముల పర్యవేక్షణ నిరంతరాయంగా జరిపి భూకబ్జా దారులపై కఠిన చర్యలు చేపట్టాలని సౌల తండ గిరిజనులు వేడుకుంటున్నారు.

## నిరుపేద ముస్లింలకు నిత్యావసరాలు పంపిణీ

**హుజూర్ నగర్ మార్చి 02 మహా:** ధనవంతుల సంపదలో పేదలకు కూడా హక్కు ఉందని దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ చెప్పారని ఆయన చూపించిన మార్గంలోనే జమాతే ఇస్లామి హింద్ సంస్థ కార్యక్రమాలు నిర్వహిస్తుందని సంస్థ సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణ అధ్యక్షులు షేక్ మజీద్ అన్నారు. ముస్లింల పవిత్ర ఆరాధనలకు, దాతృత్వానికి ప్రతీకగా నిలిచే రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా నిరుపేద ముస్లిం కుటుంబాలకు జమాతే ఇస్లామి హింద్ సంస్థ సహకారంతో పట్టణ అధ్యక్షులు షేక్ మజీద్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక టీజేఏ ప్రెస్ క్లబ్ నందు హుజూర్ నగర్ మున్సిపల్ పరిధిలోని షేక్ రజియా బేగం, షేక్ రేష్మ ఫర్హీన్, షేక్ అమీనా, షేక్ అబ్బాస్ బీ, షేక్ మస్తాన్ బీ తదితర నిరుపేద ముస్లిం కుటుంబాలకు పవిత్ర రంజాన్ మాస కానుకగా 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు మరియు కొంత నగదు అందజేశారు.

# రాష్ట్రంలో పాలన పడకేసింది

**పాలన చేతకాని సీఎం ప్రతిపక్షాలపై సీఎం విమర్శలు**

**మోడీని కలిసిన రేవంత్ రాహుల్ ను ఎందుకు ఖలవలేదు**

**బీసీలపై కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉంటే బీసీని సీఎం చేయాలి**

**మంత్రివర్గంలోకి 10 మంది బీసీలను తీసుకోవాలి**

**అధిష్టానానికి టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ లేఖ రాయాలి**

**బీసీల కోసం మాట్లాడిన ఎంఎల్ సీని సస్పెండ్ చేసిందెవరు**

**కిషన్ రెడ్డిపై వ్యక్తిగత దూషణలు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి**

**నిధులు, అబివృద్ధి, పాలన తదితర అంశావలపై రేవంత్ చర్చకు సిద్ధమా?**

**మీడియా సమావేశంలో బీజేపీ ఎంపీ రఘునందన్ రావు**



**మహా :** తెలంగాణలో పాలన పడకేసిందని, పాలన చేతకాక ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తున్నారని మెదక్ ఎంపీ, బీజేపీ నేత రఘునందన్ రావు విరుచుకుపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడిన ఎంపీ రఘునందన్ రావు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ లేకుండా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లి వచ్చారన్నారు. నిజంగా రాహుల్ గాంధీని రేవంత్ రెడ్డి కలిస్తే ఒక్క ఫోటో కూడా ఎందుకు విడుదల చేయలేదని కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రధాని మోదీతో కలిసిన ఫొటో అధికారికంగా విడుదల చేశారని, మరి రాహుల్ గాంధీని కలిసిన ఫోటో ఎక్కడ? అంటూ ప్రశ్నించారు. ఢిల్లీ లో రెండు మీడియాలో చిట్ చాట్ కి సీఎంకు టైం ఉంది కానీ రాహుల్ ను కలిసేందుకు లేదా అని ప్రశ్నించారు. పేరుకు మాత్రం పీసీసీ అధ్యక్ష పదవిని బీసీకి ఇచ్చారంటూ నిజంగా కాంగ్రెస్ పార్టీకి బీసీలపై ప్రేమ ఉంటే ముఖ్యమంత్రి పదవి సైతం బీసీలకు ఇవ్వాలన్నారు. లేకపోతే కేబినెట్ లోకి 10 మంది బీసీలను మంత్రులుగా తీసుకోవాలని డిమాండ్ చేయాలన్నారు. ప్రస్తుతం ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయని ఒక్క బీసీని మంత్రిగా తీసుకునేందుకు కాంగ్రెస్ పార్టీకి మనసు ఒప్పడం లేదా అని ప్రశ్నించారు. ఈ మేరకు అధిష్టానానికి మహేష్ కుమార్ గౌడ్ లేఖ రాయాలని రఘునందన్ రావు సూచించారు. బీసీ ల గురించి మాట్లాడిన ఎంఎల్ సీని బయటికి పంపించిన దుస్థితి కాంగ్రెస్ పార్టీదని దుయ్యబట్టారు. మమునూరు విమానాశ్రయం తెచ్చామంటూ కాంగ్రెస్ నేతలు గొప్పలు చెప్పుకోవడంపై ఎంపీ రఘునందన్ రావు తప్పుపట్టారు. చేయని పనిని చేసినట్లుగా ప్రజలను నమ్మించేందుకు కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రయత్నాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రడ్డి ఖృషి, పట్టుదల వల్లే వరంగల్ ఎయిర్ పోర్ట్ సాధ్యమైందన్నారు. కిషన్ రెడ్డి ప్రయత్నం వల్లే రాష్ట్రానికి నిధులు వస్తున్నాయన్నారు. ఇవ్వనీ తెలిసినా సీఎం రేవంత్ రెడ్డి అటెన్షన్ డైవర్షన్ కోసం కిషన్ రెడ్డిపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. నీరో పాలనను తలపించేలా రేవంత్ రెడ్డి పాలన ఉందని ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, పార్టీలోనూ అసంతృప్తులు పెరుగుతున్నాయన్నారు. వచ్చిన 10 మంది ఎమ్మెల్యేలు రేపోమాపో తిరిగి స్వంత గూటికి వెళ్తారని, ఇవన్నింటి నుంచి ప్రజల దృష్టి మళ్ళించేందుకు రేవంత్ రెడ్డి పడరాని పాట్లు ఫదుతున్నారని, అందలో భాగమే కిషన్ రెడ్డిని టార్గెట్ గా చేసుకుని మాట్లాడటమని అన్నారు. కిషన్ రెడ్డి నిజంగా తెలంగాణకు ద్రోహం చేస్తే ఆయనరింటికి సీఎం ఎందుకు భోజనానికి వెళ్ళాడని నిలదీశారు. వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ మాట్లాడటం సరైంది కాదని, ఇదే విధంగా వ్యక్తిగత దూషణలకు దిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. నిజంగా రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ పాలన, బీజేపీ పాలన, కేంద్ర నిధులు, రాష్ట్రం వాటా, ఐటీఐఆర్ తదితర అంశాలపై బహిరంగ చర్చకు రావాలని రఘునందన్ రావు సవాల్ విసిరారు. త్రిభాష విధానం తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని, ఆ మాత్రం అవగాహన లేని రేవంత్ రెడ్డి పొరుగు రాష్ట్రం సీఎం మాట్లాడుతున్నాడని తాను మాట్లాడకపోతే బాగుందదని మాట్లాడుతున్నారన్నారు, కాంగ్రెస్ సిద్ధాంతానికి విరుద్ధంగా రేవంత్ మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణలో మెజారిటీ ప్రజలకు ఉర్దూ రాదు, అలాంటప్పుడు ఉర్దూ నీ ఎందుకు ప్రజలపై రుద్దుతున్నారని ప్రశ్నించారు. ఎందుకు అన్ని ఆఫీస్ లో ఉర్దూలోరాస్తున్నారని అడిగారు. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి మాట్లాడే ముందు ఆలోచించాలని సలహా ఇచ్చారు. ప్రాంతీయ పార్టీ నేత స్టాలిన్ మాటలను రేవంత్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. 2026 లో తమిళనాడు ఎన్నికలు జరుగనున్నాయి, ఓడిపోతమనే భయంతోనే స్థానిక త్రీ భాషపై మాట్లాడుతున్నారన్నారు. పార్లమెంట్ లో కాంగ్రెస్ నేతలు హిందీలోనే మాట్లాడుతున్నారన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీద ఏసీబీ కేసు పెట్టిందని, దానికి కేంద్రానికి ఏం సంబంధమని ఆయన ప్రశ్నించారు. కేటీఆర్‌ను అరెస్ట్ చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి భయపడుతున్న కిషన్ రెడ్డి బూచిగా చూపిస్తున్నారని విరుచుకుపడ్డారు.

# మేడిగడ్డలో లోపాలు

**ఆ బ్లాక్ మళ్లీ నిర్మించాల్సిందే.. ఎన్డీఎస్ఏ సంచలన రిపోర్ట్**

**డిజైన్ రూపకల్పన సీడబ్ల్యూసీకి అప్పగించాలని సూచన**




**మహా :** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీలో ప్లానింగ్ నుంచి నిర్వహణ వరకు లోపాలు ఉన్నట్లు నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) గుర్తించింది. మేడిగడ్డ బ్యారేజ్ లోని ఏడో బ్లాక్ కూల్చాల్సిందేనని ఇప్పటికే సిఫార్సు చేసిన ఎన్డీఎస్ఏ మళ్లీ నిర్మించాలని సూచించింది. అయితే ఈ బ్లాకును మళ్లీ నిర్మించేందుకు అవసరమైన డిజైన్‌ను రూపొందించే బాధ్యతను కేంద్ర జలసంఘానికి (సీడబ్ల్యూసీ) అప్పగించాలని సూచించింది కేంద్ర జలసంఘం మాజీ ఛైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో ఏర్పాటైన నిపుణుల కమిటీ రెండు వారాల క్రితమే రిపోర్టును అందజేయగా దీనిపై మూడ్రోజుల క్రితం కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ చర్చించినట్లు సమాచారం. ఇందులోని ముఖ్యమైన అంశాలను ఎన్డీఎస్ఏ, జలసంఘం, జల్‌శక్తి అధికారులకు చంద్రశేఖర్ అయ్యర్ ప్రజంటేషన్ ద్వారా వివరించినట్లు సమాచారం.

### చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో

2023 అక్టోబరులో మేడిగడ్డ బ్యారేజీ కుగింది. దీంతో ఏడో బ్లాక్ పాటు కొన్ని పియర్స్ దెబ్బతిన్నాయి. ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ పరిశీలించి ప్లానింగ్, డిజైన్, క్వాలిటీ కంట్రోల్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌లో వైఫల్యాల వల్ల దెబ్బతిన్నట్లుగా గుర్తించింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు గతేడాది మార్చి 2న చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో నిపుణుల కమిటీని ఎన్డీఎస్ఏ నియమించింది. బ్యారేజీలను అధ్యయనం చేసి వాటి పరిస్థితిని అంచనా వేసి ఏయే చర్యలు తీసుకోవాలో సిఫార్సు చేయాలని కోరింది. మేడిగడ్డతో పాటుగా కాళేశ్వరంలోని మిగితా అన్నారం, సుందిళ్లను కూడా అధ్యయనంలో చేర్పించింది. ఈ కమిటీ 2024 మే 1న ప్రాథమిక నివేదిక ఇచ్చింది. బ్యారేజీలలో నీటిని నిల్వ చేయకుండా గేట్లు తెరిచి ఉంచాలని, పలు పరీక్షలు చేయించాలని సూచించింది.

మేడిగడ్డ బ్యారేజీకు సంబంధించి అన్ని పరీక్షలు పూర్తయ్యాక పలు సిఫార్సులతో తుది నివేదికను ఇచ్చింది. బ్యారేజీల పరిస్థితి, వైఫల్యాలకు కారణాలు, తదుపరి తీసుకోవాల్సిన చర్యల గురించి ఈ నివేదికలో పొందుపరిచింది. నివేదికలో డిజైన్, నిర్మాణం, నిర్వహణలో లోపాలున్నాయని, మేడిగడ్డ ఏడో బ్లాక్‌ను తొలగించి మళ్లీ నిర్మించాల్సి ఉంటుందని వెల్లడించింది. అంతే కాకుండా మేడిగడ్డ బ్యారేజీ కాలమ్స్‌లోనూ లోపాలున్నట్లు గుర్తించిన కమిటీ బ్యారేజీ పైభాగంలో సీకెంట్ పైల్స్ నాణ్యత కూడా సరిగా లేదని అభిప్రాయపడింది. తుది నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి అందిన తర్వాతనే పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## 5 నుంచే తెలంగాణ ఇంటర్ పరీక్షలు

**మహా:** తెలంగాణలో మార్చి 5 నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ కోసం ఇంటర్ బోర్డు అధికారులు వెబ్‌సైట్‌లో ఉంచారు. తొలుత కళాశాలల లాగిన్‌లలో ఉంచిన అధికారులు.. తాజాగా ప్రథమ, ద్వితీయ ఇంటర్‌తో పాటు బ్రిడ్జి కోర్సు పరీక్షల హాల్‌టికెట్లను వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్‌కు అవకాశం కల్పించారు. విద్యార్థులు తమ రోల్ నంబర్/ఎస్ఎస్‌సీ హాల్‌టికెట్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మార్చి 5న ప్రారంభం కానున్న ప్రథమ ఇంటర్ పరీక్షలు 24తో ముగియనున్నాయి. అలాగే, మార్చి 6 నుంచి మొదలయ్యే ద్వితీయ ఇంటర్ పరీక్షలు 25వరకు జరుగుతాయి. ఈ పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతాయి. ఈ ఏడాది దాదాపు 9 లక్షల మందికి పైగా విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాసే అవకాశం ఉంది.



## సన్ ఫ్లవర్ గింజల కొనుగోలు కేంద్రాలు ఏమయ్యాయి

- **రైతులు వేల రూపాయలు నష్టపోతున్నారు**
- **సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీష్‌రావు బహిరంగ లేఖ..**

**మహా :** నూనె గింజల కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు బహిరంగ లేఖ రాశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నూనె గింజల ఉత్పత్తిని పెంచడానికి రైతులను చైతన్యవంతులుగా తీర్చిదిద్దడం జరిగిందని, సమయానికి రైతుబంధు తో పాటు సబ్సిడీలు అందజేసి నూనె గింజల పంటలను సాగు చేసేలా ప్రోత్సాహం కల్పించామని హరీష్ రావు పేర్కొన్నారు. సాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఫలితంగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున నూనె పంటలు సాగు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం పొద్దుతిరుగుడు (సన్ ఫ్లవర్) పంట కోతకు వచ్చింది. సన్ ఫ్లవర్ గింజలను విక్రయించడానికి ఇప్పటిదాకా రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉందని హరీష్ రావు పేర్కొన్నారు. సన్ ఫ్లవర్ మద్ధతు ధరను నాఫెడ్ రూ. 7280 గా ప్రకటించగా, కనుగోలు కేంద్రాలు లేని కారణంగా రైతులు రూ. 5,500 నుంచి రూ. 6000 వరకు దళారులకు క్వింటాల్ చొప్పున విక్రయిస్తున్నారన్నారు. ఇప్పటిదాకా కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. దళారులకు విక్రయించడం వల్ల క్వింటాల్ కు రూ. 1000 నుండి రూ. 2000 వరకు నష్టాన్ని చవిచూడాల్సిన దుస్థితి రైతులకు కలిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం కారణంగా తెలంగాణ వ్యవసాయం తిరోగమన దిశలో పయనిస్తుందన్నారు. నూనె పంటలు వేయాలంటేనే రైతులు ఆందోళన చెందే పరిస్థితులను ప్రభుత్వం కల్పించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర వ్యాప్తంగా సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు హరీష్ రావు లేఖలో పేర్కొన్నారు.

# బీఎస్పీ అధినేత్రి మాయావతి సంచలన నిర్ణయం

**పార్టీ పదవుల నుంచి మేనల్లుడు తొలగింపు**



**మహా:** బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి, ఉత్తర్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి కీలక నిర్ణయం తీసుకున్నారు. తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను అన్ని పార్టీ పదవుల నుంచి తప్పించారు. తాను జీవించినంత కాలం పార్టీలో తనకు రాజకీయ వారసుడు ఉండరని ప్రకటించారు. లఖ్‌నవూలో ఆదివారం జరిగిన బీఎస్పీ ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

### పార్టీ సమన్వయకర్తలుగా ఇద్దరు

అలాగే పార్టీ నాయకత్వంలో గణనీయమైన మార్పులను చేపట్టారు మాయావతి. తన సోదరుడు ఆనంద్ కుమార్, రాజ్యసభ ఎంపీ రామ్ జీ గౌతమ్‌ను బీఎస్పీ జాతీయ సమన్వయకర్తలుగా నియమించారు. వీరు దేశవ్యాప్తంగా పార్టీ వ్యవహారాలను పర్యవేక్షిస్తారని మాయావతి పేర్కొన్నారు. అలాగే తన రాజకీయ వారసత్వంపై కూడా మాయావతి స్పష్టమైన ప్రకటన చేశారు. తాను బతికున్నంత వరకూ పార్టీకి తన రాజకీయ వారసుండంటూ ఎవరూ ఉండబోరని స్పష్టం చేశారు. తనకు పార్టీ, ఉద్యమం ముఖ్యమని తెలిపారు. ఆ తర్వాతే బంధుత్వాలు అని నొక్కి చెప్పారు. "పార్టీ ప్రయోజనాల దృష్ట్యా ఆకాశ్ ఆనంద్ మామ అశోక్ సిద్ధార్థ్‌ను బీఎస్పీ నుంచి బహిష్కరించాను. ఉత్తర్‌ప్రదేశ్‌తో సహా దేశవ్యాప్తంగా పార్టీని రెండు వర్గాలుగా విభజించడం ద్వారా ఆయన పార్టీని బలహీనపరిచేందుకు ప్రయత్నించారు. ఇది భరించలేని చర్య. అశోక్ సిద్ధార్థ్ కుమార్తెను ఆకాశ్ ఆనంద్ వివాహం చేసుకున్నాడు. అశోక్ సిద్ధార్థ్ కుమార్తె ప్రభావం ఆకాశ్‌పై ఉంది. అది అంత సానుకూలంగా లేదు. అటువంటి పరిస్థితిలో పార్టీ ప్రయోజనాల దృష్ట్యా ఆకాశ్‌ను పార్టీ బాధ్యతల నుంచి తప్పిస్తున్నా. అందుకు ఆకాశ్ మామ అశోక్ సిద్ధార్థే కారణం. ఇప్పుడు ఆకాశ్ స్థానంలో పార్టీ సమన్వయకర్తగా ఆనంద్ కూమార్ ఉంటారు. ఇప్పటివరకు ఆయన నన్ను ఏ విషయంలోనూ నిరాశపరచలేదు. పార్టీకి, ఉద్యమానికి ఎటువంటి హాని కలిగించలేదు." అని బీఎస్పీ అధినేత్రి మాయావతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

### ఆనంద్ మామపై గతంలో వేటు

అలాగే పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను పాల్పడుతున్నారనే ఆరోపణలపై ఆకాశ్ ఆనంద్ మామ అశోక్ సిద్ధార్థ్, బీఎస్పీ మేరఠ్ ఇన్ ఛార్జ్ నితిన్ సింగ్ ను పార్టీ నుంచి మాయామతి గత నెలలో వేటు వేశారు. నితిన్ సింగ్ ఇటీవల వరకు దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షించేవారు. తన మామ సిద్ధార్థ్ పై వేటు పడిన నెల రోజుల్లో ఆనంద్‌ను కూడా కీలక పదవుల నుంచి తప్పించడం గమనార్హం. మాయావతి తమ్ముడి కుమారుడైన ఆకాశ్ ఆనంద్ 2016లో బీఎస్పీలో చేరారు. 2019 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పార్టీ తరపున విస్తృతంగా ప్రచారం చేశారు. పార్టీలో మాయావతి తర్వాత అధిక ప్రాధాన్యం కలిగిన వ్యక్తిగా గుర్తింపు సాధించారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు తన రాజకీయ వారసుడిగా ఆకాశ్ పేరును మాయావతి ప్రకటించారు. ఆ తర్వాత జులైలో మళ్లీ పార్టీ బాధ్యతలను ఆయనకు అప్పగించారు. తాజాగా ఆనంద్ పై వేటు పడింది. కాగా, ఆకాశ్ ఆనంద్‌ను పార్టీ బాధ్యతల నుంచి మాయవతి తప్పించడం ఇది రెండోసారి.

# అనిల్ రావిపూడి ఇంట్లో కెమిస్ట్రీ కుంపటి

**సైబర్ క్రైమ్ పోలీసులకి ఫిర్యాదు.. ఫేక్ ప్రచారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరిక**

**మహా:** టాలీవుడ్ లో పట్టిందల్లా బంగారమయ్యే దర్శకులలో ప్రముఖ డైరెక్టర్ అనిల్ రావిపూడి ఒకరు. ఇప్పటివరకూ అనిల్ రావిపూడి తీసిన సినిమాలన్నీ బ్లాక్ బస్టర్ హిట్ అయ్యాయి. అయితే ఈమధ్య కొందరు వ్యూస్ కోసం చేసే తప్పుడు ప్రచారాల కారణంగా సినీ సెలెబ్రిటీలు చిక్కుల్లో పడుతున్నారు. ఇలాంటి చిక్కుల్లోనే పడ్డ డైరక్టర్ అనిల్ రావిపూడి ఓ హీరోయిన్ విషయంలో ఇటీవలే సైబర్ క్రైం పోలీసులని ఆశ్రయించాల్సి వచ్చింది. ఇంతకీ అసలు విషయం ఏమిటంటే ఇటీవలే అనిల్ రావిపూడి ఓ సినిమా ప్రమోట్ చేసేందుకు వెళ్ళాడు. ఈ క్రమంలో యాంకర్ మాట్లాడుతూ మీ నెక్స్ట్ సినిమాలో కూడా హీరోయిన్ మీనాక్షి చౌదరిని కంటిన్యూ చెయ్యండి.. మీకు ఆమెకి మధ్య కెమిస్ట్రీ బాగా కుదిరింది అంటూ సరదాగా కామెంట్లు చేసింది. దీంతో కొందరు వ్యూస్ కోసం ఈ కామెంట్లని వక్రీకరించి ఫేక్ థంబ్ నెయిల్స్ పెడుతూ వీడియోలు, మీమ్స్ షేర్ చేస్తున్నారు. దీంతో కొందరు అనిల్ రావిపూడి బంధువులు ఈ వీడియోలని తన భార్యకి షేర్ చేస్తున్నారట. చివరికి ఈనోటా ఆ నోటా పాకుతూ అనిల్ రావిపూడి చెవిన పడింది. దీంతో వెంటనే అనిల్ రావిపూడి సైబర్ క్రైమ్ పోలీసులని సంప్రదించి ఫిర్యాదు చేశాడు.. అలాగే తాను ప్రశాంతంగా సినిమాలు చేసుకుంటున్నానని తనకెలాంటి కెమిస్ట్రీలు లేవని క్లారిటీ ఇచ్చాడు. అలాగే తన గురించి కెమిస్ట్రీ వీడియోలు షేర్ చేసిన వారిని వీడియోలు తొలగించాలని లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించాడు. కొందరు నెటిజన్లు ఈ విషయం గురించి స్పందిస్తూ ఒకే సినిమాలో కలసి పని చేసినంత మాత్రాన హీరోయిన్, డైరెక్టర్ మధ్య ఏదో ఉందంటూ ప్రచారాలు చెయ్యడం సరికాదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



# ఉద్యోగులూ.. 60 గంటలు కష్టపడితేనే..

ఉద్యోగుల పని గంటల గురించి రోజుకో చర్చ నడుస్తోంది. యాజమాన్యాలు పనిఒత్తిడి పెంచి తమకు వ్యక్తిగత, కుటుంబంతో గడిపే సమయాన్ని దూరం చేస్తున్నాయని ఓవైపు ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తుంటే మరోవైపు పరిశ్రమ ప్రముఖులు, వ్యాపారాధినేతలు దీనిపై విభిన్న వ్యాఖ్యానాలు చేస్తూనే ఉన్నారు. తాజాగా గూగుల్ కో ఫౌండర్ సెర్గీ బ్రిన్.. వారానికి 60 గంటలు కష్టపడాలని తమ ఉద్యోగులను కోరారు. ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏజీఐ) అభివృద్ధిని వేగవంతం చేయడానికి సాహసోపేతమైన చర్యలో, గూగుల్‌కు చెందిన జెమినీ ఏఐ మోడళ్లలో పనిచేసే ఉద్యోగులు వారానికి 60 గంటలు పని చేసే విధానాన్ని అవలంబించాలని, రోజూ ఆఫీస్‌కు రావాలని సెర్గీ బ్రిన్ పిలుపునిచ్చారు. అంతర్గత మెమోలో పేర్కొన్న ఈ ఆదేశం, యంత్రాలు మానవ మేధస్సును మించిన మైలురాయి అయిన ఏజీఐని సాధించే రేసులో పెరిగిన అత్యవసరతను, పోటీ ఒత్తిడిని తెలియజేస్తోంది.

**తుది రేసు మొదలైంది**

కృత్రిమ మేధ పరిశ్రమలో పోటీ తీవ్రమైన నేపథ్యంలో బ్రిన్ ఇచ్చిన ఈ పిలుపునకు ప్రాధాన్యం ఏర్పడింది. ముఖ్యంగా 2022లో చాట్‌జీపీటీని ప్రారంభించిన తరువాత ఏఐ పరిశ్రమలో పోటీ పెరిగింది. ఇది జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో వేగవంతమైన పురోగతిని ప్రేరేపించింది. "ఏజీఐకి తుది రేసు ప్రారంభమైంది" అని బ్రిన్ తన మెమోలో పేర్కొన్నారు. ఉద్యోగులు తమ ప్రయత్నాలను "టర్బోచార్జ్" చేస్తే.. ఈ రేసులో గెలవడానికి అవసరమైన అన్ని అంశాలు గూగుల్ వద్ద ఉన్నాయన్నారు.

**ఉత్పాదకతకు ప్రమాణం**

వారానికి 60 గంటలు పనిచేయడం ఉత్పాదకత ప్రమాణాన్ని సూచిస్తుందని, అదే ఈ పరిమితిని మించితే బర్న్‌అవుట్‌కు దారితీస్తుందని కూడా బ్రిన్ హెచ్చరించారు. మరోవైపు ఉద్యోగులు 60 గంటల కంటే తక్కువ పని చేయడంపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి ప్రవర్తన "అనుత్పాదకంగా ఉండటమే కాకుండా, ఇతరులకు చాలా నిరుత్సాహాన్ని కలిగిస్తుంది" అని పేర్కొన్నారు. బ్రిన్ సిఫార్సులు కార్పొరేట్ అమెరికాలో విస్తృత ధోరణిని ప్రతిబింబిస్తున్నాయి. ఇక్కడ కంపెనీలు ఉత్పాదకత, టీమ్ వర్క్ ను పెంచడానికి హైబ్రిడ్ పని విధానాలను తిప్పికొడుతున్నాయి.

**సెల్ఫ్ ఇంప్రూవ్‌మెంట్ కోసం ఏఐ వినియోగం**

ఎక్కువ పని గంటల కోసం వాదించడంతో పాటు, వారి కోడింగ్, పరిశోధన సామర్థ్యాలను పెంచడానికి గూగుల్ స్వంత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాధనాలను ఉపయోగించాలని బ్రిన్ ఉద్యోగులను కోరారు. "మన స్వంత కృత్రిమ మేధను ఉపయోగించడం ద్వారా ప్రపంచంలోనే అత్యంత సమర్థవంతమైన కోడర్లు, ఏఐ శాస్త్రవేత్తలుగా మారాలి" అని జెమినీ టీమ్ సభ్యులకు ప్రత్యేకంగా పిలుపునిచ్చారు. ఈ విధానం ఏజీఐని సాధించడంలో ఏఐ ఆధారిత స్వీయమెరుగుదల ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది.




**వర్క్‌ఫోర్స్‌పై ప్రభావం**

మరింత కఠినమైన పని షెడ్యూళ్ల కోసం బ్రిన్ చేస్తున్న ఒత్తిడి ఏజీఐ అభివృద్ధిలో గూగుల్ నాయకత్వం వహించాలనే ఆయన దార్శనికతను ప్రతిబింబిస్తున్నప్పటికీ, ఇది శ్రామిక శక్తిపై ప్రభావాన్ని గురించి కూడా ప్రశ్నలను లేవనెత్తుతుంది. ఏజీఐని సాధించాల్సిన ఆవశ్యకత స్పష్టంగా కనిపిస్తోంది. ఇది గూగుల్‌లో సాంకేతిక పురోగతి అత్యవసరతను ప్రతిబింబిస్తోంది.





# లాండ్రీ రోబో..

## ఉతికి ఆరేస్తుంది!

బట్టలు ఉతికే వాషింగ్ మెషిన్స్ వచ్చినా కూడా చాలామంది మురికి బట్టలను చేతితోనే ఉతుకుతుంటారు. పైగా బట్టలను వాషింగ్ మెషిన్‌లో లోడ్ చేయటం, ఉతికిన బట్టలను తిరిగి అన్‌లోడ్ చేసి ఆరేయటం అంతా మనమే చేసుకోవాలి. ఇప్పుడు ఈ సమస్యలన్నింటినీ దూరం చేస్తుంది ఈ రోబో. ఏఐ టెక్స్‌టైల్ ప్రాసెసింగ్, పాయింట్ క్లౌడ్ ఆధారిత అల్గారిథంతో తయారు చేసిన ఈ రోబో ఎలాంటి బట్టల మురికినైనా, చేతితో రుద్ది రుద్ది పోగొడుతుంది. తెల్ల బట్టలను ఒక రకంగా, రంగు పోయే దుస్తులను ఒక విధంగా ఇలా.. ఏ రకం దుస్తులను ఏ విధంగా ఉతకాలో ఆ విధంగానే ఉతుకుతుంది. వాషింగ్ మెషిన్ కేవలం బట్టలను ఉతకడం మాత్రమే చేస్తుంది. కాని, ఈ రోబో బట్టలను ఆరేస్తుంది. ఆరేసిన బట్టలను మడతపెడుతుంది. ఆర్డర్ ఇస్తే ఇస్త్రీ కూడా చేస్తుంది. బాగుంది కదూ! త్వరలోనే మార్కెట్‌లోకి విడుదల కానుంది.

# మార్చిలో 12 రోజులు స్టాక్ మార్కెట్ క్లోజ్!




ప్రస్తుత 202425 ఆర్థిక సంవత్సరం మార్చిలో ముగియనుంది. దీంతో ఇన్వెస్టర్లు ఈ నెలలో ట్రేడింగ్‌కు సిద్ధమవుతున్నారు. అయితే ట్రేడింగ్‌ను బాగా ప్లాన్ చేయడానికి మార్చి నెలలో స్టాక్ మార్కెట్ ఏయే రోజుల్లో పనిచేస్తుంది.. ఎప్పుడు మూసివేత ఉంటుంది అన్నది తెలుసుకోవడం మంచిది. ఈ హాలిడే క్యాలెండర్ ను స్టాక్ ఎక్స్ఛేంజీలు జారీ చేస్తాయి. తమ అధికారిక వెబ్ సైట్‌లలో ఇవి అందుబాటులో ఉంటాయి. బీఎస్ఈ ప్రతి సంవత్సరం పూర్తి ట్రేడింగ్ హాలిడేస్ జాబితాను ప్రచురిస్తుంది. సాధారణంగా ఈ జాబితాలో పండుగలు, జాతీయ సెలవులు, వారాంతపు సెలవులు ఉంటాయి. బడ్జెట్ సమర్పణ వంటి ప్రత్యేక సందర్భాలు మినహా అన్ని వారాంతాల్లో స్టాక్ మార్కెట్లు ట్రేడింగ్‌కు అందుబాటులో ఉండవు. అందువల్ల మార్కెట్ షెడ్యూల్‌ను తెలుసుకుని తదనుగుణంగా ట్రేడింగ్‌ను ప్లాన్ చేయడానికి ఇన్వెస్టర్లు సెలవుల జాబితాపై ఆధారపడాలి. మార్చిలో స్టాక్ మార్కెట్ కు 12 రోజులు సెలవులు ఉంటాయి. ఇన్వెస్టర్లు ఈ రోజుల్లో మార్కెట్లో ఎలాంటి ట్రేడింగ్ లు చేయలేరు. వారాంతపు సెలవులతో పాటు ఈ నెలలో హోలీ, రంజాన్ పండుగకు కూడా మార్కెట్లు మూతపడతాయి. అందువల్ల మార్చిలో చివరి ట్రేడింగ్ రోజు 28వ తేదీ. ఎందుకంటే 29, 30 తేదీలు వారాంతపు సెలవులు. ఆ రోజుల్లో మార్కెట్లు పనిచేయవు.

**మార్చిలో స్టాక్ మార్కెట్ సెలవులు ఇవే**

- మార్చి 1 శనివారం వీకెండ్ హాలిడే
- మార్చి 2 ఆదివారం వీకెండ్ హాలిడే
- మార్చి 8 శనివారం వీకెండ్ హాలిడే
- మార్చి 9 ఆదివారం వీకెండ్ హాలిడే
- మార్చి 14 శుక్రవారం హోలీ
- మార్చి 15 శనివారం వీకెండ్ హాలిడే
- మార్చి 16 ఆదివారం వీకెండ్ హాలిడే
- మార్చి 22 శనివారం వీకెండ్ హాలిడే
- మార్చి 23 ఆదివారం వీకెండ్ హాలిడే
- మార్చి 29 శనివారం వీకెండ్ హాలిడే
- మార్చి 30 ఆదివారం వీకెండ్ హాలిడే
- మార్చి 31 సోమవారం ఈద్‌ఉల్‌ఫితర్ (రంజాన్)

# హైదరాబాద్‌లో డేటా సెంటర్ల జోరు..

## ఆ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ హుషారు

దక్షిణాది నగరాల్లో డేటా సెంటర్ల జోరు కొనసాగుతోంది. గ్లోబల్ డేటా సెంటర్లకు చిరునామాగా నిలుస్తున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, వ్యూహాత్మక మౌలిక సదుపాయాల పెట్టుబడులు, డిజిటల్ సేవలకు పెరుగుతున్న డిమాండ్ డేటా సెంటర్ల వృద్ధికి ప్రధాన కారణాలు. ప్రస్తుతం చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో 47 లక్షల చ.అ.ల్లో 213 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. మరో 27 లక్షల చ.అ.ల్లో 186 మెగావాట్లు నిర్మాణ దశలో, 24 లక్షల చ.అ.ల్లో 168 మెగావాట్లు ప్రణాళిక దశలో ఉన్నాయని కొల్లియర్స్ ఇండియా నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న డేటా సెంటర్ల సామర్థ్యంలో 35 ఆక్యుపెన్సీ బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) విభాగానిదే.. ఆ తర్వాత 30 శాతం ఐటీ రంగం, 20 శాతం క్లౌడ్ సర్వీస్ విభాగం, ఇతరుల వాటా 15 శాతంగా ఉంది. డేటా సెంటర్ల నెలవారీ ఛార్జీలు కిలోవాట్‌కు రూ.6,650 నుంచి 8,500లుగా ఉన్నాయి. ప్రభుత్వ విధానాలు, మెరుగైన మౌలిక వసతులు, కనెక్టివిటీ కారణంగా హైదరాబాద్‌లో డేటా సెంటర్ల జోరు కొనసాగుతోంది. అత్యంత వేగంగా నగరం డేటా సెంటర్ల హాట్‌స్పాట్‌గా



అభివృద్ధి చెందుతోంది. ప్రస్తుతం భాగ్యనగరంలో 10 లక్షల చ.అ.ల్లో 47 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లు అందుబాటులో ఉండగా.. మరో 3 లక్షల చ.అ.ల్లో 20 మెగావాట్లు నిర్మాణంలో, 5 లక్షల చ.అ.ల్లో 38 మెగావాట్లు ప్రణాళిక దశలో ఉన్నాయి. ప్రస్తుతం నగరంలో మైక్రోసాఫ్ట్, సీటీఆర్ఎల్ఎస్ వంటి పలు సంస్థలు డేటా సెంటర్లున్నాయి. గచ్చిబౌలి, మేకగూడ, షాద్‌నగర్, చందన్‌వ్యాలీ వంటి పలు ప్రాంతాల్లో మరిన్ని డేటా సెంటర్లు రానున్నాయి.



# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL

# కలసివెళ్లి.. కానరాని లోకాలకు

## కారును ఢీకొన్న టిప్పర్ లారీ

ఐదుమంది బీటెక్ విద్యార్థుల దుర్మరణం

వీకెండ్ టూర్‌లో ఘోర విషాదం

చామరాజనగర జిల్లాలో ప్రమాదం




**మైసూరు:** ఐదుమంది భవిష్యత్తు గురించి ఎన్నో కలలు కన్నారు. ఇంజినీరింగ్ కోర్సు అయిపోయిన తరువాత మంచి ఉద్యోగాలు చేద్దామని, లేదా మరింత ఉన్నత చదువులు చదవాలని భావించారు. అయితే వీకెండ్ టూర్ ఆలోచన- ఓ టిప్పర్ లారీ వారి స్వప్నాలను భగ్నం చేశాయి. ఐదుగురి కుటుంబాలలో అంతులేని విషాదాన్ని కలిగించాయి. సరదాగా సాగుతున్న విహారయాత్రలో టిప్పర్ లారీ డ్రైవర్ యమదూత మాదిరిగా విరుచుకుపడ్డాడు.

**మైసూరు నుంచి బయల్దేరి..**

చామరాజనగర జిల్లా కొళ్లేగాళ వద్ద కారును టిప్పర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో ఐదుమంది ఇంజినీరింగ్ విద్యార్థులు దుర్మరణం చెందారు. కొళ్లేగాల రూరల్‌లోని చిక్కందువాడి గ్రామం వద్ద రహదారిలో ఈ విషాదం సంభవించింది. వివరాలు..మైసూరు సిటీలో నివసించే శ్రీలక్ష్మి, లిఖిత, మండ్యకు చెందిన సుహాన్, నితిన్, శ్రేయస్‌లు మైసూరు ఎంఐటీ ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతున్నారు. వీరి వయస్సు 20- 23 ఏళ్లలోపు ఉంటుంది. అందరూ మంచి స్నేహితులు. మలె మహదేశ్వర బెట్టలో జరుగుతున్న శివరాత్రి ఉత్సవాలను చూసుకుని, ఆ తరువాత హొగెనేకల్ జలపాతానికి వెళ్లాలని బయల్దేరారు. ఓ గంటన్నర పాటు ప్రయాణం సాగింది.

**మృత్యుశకటమైన టిప్పర్**

ఇంతలో ఓ టిప్పర్ లారీ వేగంగా వస్తూ మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేసింది, ఈ క్రమంలో కారును ఢీకొని కొంత దూరం ఈడ్చుకెళ్లి రెండు వాహనాలు రోడ్డు పక్కకు పడిపోయాయి. కారు వెళ్లి ఓ నీటి గుంతలోకి పల్టీలు కొట్టింది. కారు చాలా భాగం నుజ్జయింది. ఈ తాకిడికిలో అందులో ఐదుగురు యువతీ యువకులు గాయాలతో ప్రాణాలు కోల్పోయారు. స్థానిక ప్రజలు చేరుకుని కారులో చిక్కుకుపోయిన మృతదేహాలను బయటకు తీసుకొచ్చారు. మరోవైపు టిప్పర్ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. కొళ్లేగాల రూరల్ పోలీసులు చేరుకుని సహాయక చర్యలను చేపట్టారు. ఘటనాస్థలి భీతావహంగా మారింది.

**ఇరుకు, మలుపుల రోడ్డు : ఎస్పీ**

జిల్లా ఎస్పీ బీటీ కవిత ఘటనాస్థలిలో మాట్లాడుతూ ఉదయం 9 గంటల సమయంలో మహదేశ్వర బెట్ట నుంచి వస్తున్న టిప్పర్ లారీ ఓవర్ టేక్ చేయబోతూ ఎదురుగా వస్తున్న విద్యార్థుల కారును ఢీకొట్టింది, ఆపై 26, 30 మీటర్ల దూరం లాక్కెళ్లింది. రెండు వాహనాలూ రోడ్డుపక్కన బోల్తా పడ్డాయి అని తెలిపారు. పరారీలో ఉన్న టిప్పర్ డ్రైవర్ కోసం గాలిస్తున్నట్లు ఆమె చెప్పారు. అక్కడ రోడ్డు ఇరుకుగా, అనేక మలుపులతో ఉండగా, టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం ప్రమాదానికి కారణమని తెలిపారు. కొళ్లేగాల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఘోరం గురించి తెలియగానే తల్లిదండ్రులు, బంధుమిత్రులు ఆస్పత్రికి వచ్చారు. వారి రోదనలతో ఆస్పత్రిలో విషాదం నెలకొంది.

# చెఫ్ అవతారంలో సోనూసూద్.. దోశ రేటు రెట్టింపు చేసి..

కరోనా కాలంలో మానవత్వానికి మారుపేరుగా నిలిచారు బాలీవుడ్ హీరో సోనూసూద్(Sonu Sood). అది మొదలు ఆయన ఎక్కడ ఏ కార్యక్రమంలో పాల్గొన్నా ఆ అంశం వైరల్‌గా మారుతోంది. సోనూసూద్ తరచూ చిరు వ్యాపారులకు సాయం అందిస్తుంటారు. తాజాగా సోనూసూద్‌కు సంబంధించిన మరో వీడియో వైరల్‌గా మారింది. దానిలో సోనూసూద్ చెఫ్ అవతారంలో కనిపిస్తున్నారు. సోను సూద్ ఇలీవల తమిళనాడులోని చెన్నైలో రోడ్డుపక్కనున్న ఒక టిఫిన్ సెంటర్‌కు వెళ్లారు. అతని బృందం కూడా అతని వెంట ఉంది. ఇంతలో సోనూసూద్ దోశె వేసేందుకు ప్రయత్నించారు. ఈ ఉదంతానికి సంబంధించిన వివరాలను ఆయన తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేస్తూ, 'ఇది నా ఇడ్లీ సాంబార్ దుకాణం' అని రాశారు. వీడియో క్లిప్ మొదట్లో సోనూసూద్ ఆ ఫుడ్ స్టాల్ (Food stall) యజమాని శాంతిని పరిచయం చేసుకున్నారు. తరువాత అక్కడ సిద్ధమైన వంటకాలన్నీ కనిపిస్తాయి. తరువాత కెమెరా కిచెన్ కౌంటర్ వైపు కదులుతుంది. అక్కడ కొబ్బరి పచ్చడి, సాంబారు, ఇడ్లీలతో కూడిన పాత్రలు ఉంటాయి. ఇడ్లీ, వడ ప్లేటు పట్టుకున్న సోనూసూద్.. మూడు ఇడ్లీలు, రెండు వడల ధర కేవలం రూ. 35 అని చెబుతారు. దీనిపై మీకు నమ్మకం లేదా?' అని ప్రశ్నిస్తారు. అయితే టిఫిన్ సెంటర్ యజమాని శాంతి ఆయనకు ఆ టిఫిన్ రూ. 30కే ఇస్తుంది. తరువాత సోనూసూద్ చెఫ్ అవతారమెత్తి దోశ వేసేందుకు ప్రయత్నిస్తారు. అప్పుడు శాంతి ప్లెయిన్ దోశ రూ. 15 అని చెబుతుంది. వెంటనే సోనూ సూద్ దోశ ధర రెండింతలు చేస్తూ రూ. 30 అయ్యిందని చెబుతారు. తరువాత ఆయన తన బృందంలోని సభ్యులందరికీ దోశలను వడ్డిస్తారు.

**గతంలో కూమారి ఆంటీని కలిసి..**

గత ఏడాది సోనూసూద్ హైదరాబాద్‌లో ఫుడ్‌స్టాల్ నిర్వాహకురాలు కుమారి ఆంటీని కలుసుకున్నారు. అప్పుడు ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియోలో.. కుమారి



ఆంటీని పలుకరిస్తూ కనిపించారు. 'నేను కుమారి ఆంటీ పక్కన ఉన్నాను. ఆమె గురించి చాలా విన్నాను. ఆమె స్వయంకృషితో ఎదిగిన మహిళ' అని ఆమెను మెచ్చుకున్నారు. మహిళా సాధికారతకు కుమారి ఆంటీ ఉత్తమ ఉదాహరణ అని సోనూసూద్ అన్నారు. కుమారీ ఆంటీ ఫుడ్ స్టాల్‌లో సోనూసూద్ వెజిటేరియన్ మీల్స్ తిన్నారు.

## 9,000 హార్స్ పవర్ రైలు

# ఇంజిన్ సిద్ధం..

**న్యూఢిల్లీ:** భారతీయ రైల్వే దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటిదని అంటారు. దేశంలోని చాలామంది రైళ్లపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అటు ప్రయాణికులను, ఇటు వస్తువులను తరలించేందుకు రైళ్లు రవాణా రంగంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. రైల్వేలు ఒకవైపు ఆధునికత దిశగా పరిగెడుతూ, మరోవైపు ప్రయాణికులకు అత్యుత్తమ సేవలు అందిస్తున్నాయి. తాజాగా భారతీయ రైల్వే అత్యంత శక్తివంతమైన ఇంజిన్‌ను రూపొందించింది. ఈ ఇంజిన్ వచ్చే నెలలో ట్రాక్‌లపై పరుగులు తీయనున్నదని సమాచారం. ఈ అత్యంత శక్తివంతమైన ఇంజిన్‌ను గుజరాత్(Gujarat))లోని దాహోద్ ఫ్యాక్టరీలో తయారు చేశారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తాజాగా ఈ ఇంజిన్ తయారు చేసిన ఫ్యాక్టరీని సందర్శించారు. ఇక్కడ గూడ్స్ రైలు ఇంజన్లు తయారు చేస్తుంటారు. ప్రస్తుతం మొదటి అత్యంత శక్తివంతమైన ఇంజిన్ సిద్ధం అయ్యింది. ఈ రైల్వే కర్మాగారాన్ని 'మేక్ ఇన్ ఇండియా' ధ్యేయంలో భాగంగా ఏర్పాటు చేశారు. ఈ కర్మాగారానికి 2022లో ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. కేవలం మూడేళ్లలో ఈ కర్మాగారం దేశంలోనే అత్యంత శక్తివంతమైన రైలు ఇంజిన్‌ను నిర్మించి, ట్రాక్‌పైకి తీసుకువచ్చింది. భారతీయ రైల్వే ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌లను 6000 హార్స్‌పవర్ నుండి 9000 హార్స్‌పవర్‌కు అప్‌గ్రేడ్ చేస్తోంది. ఇంజినీరింగ్ కంపెనీ సీమెన్స్ గుజరాత్‌లోని దాహోద్‌లో రూ.20,000 కోట్ల ఖరీదు చేసే 9,000 హార్స్ పవర్ కలిగిన 1,200 ఎలక్ట్రిక్ ఇంజిన్‌లను తయారు చేయనుంది. 9000 హార్స్‌పవర్ సామర్థ్యం కలిగిన ఈ ఇంజిన్ 4,500 టన్నుల సరుకును మోసుకెళ్లే గూడ్స్ రైలును అధిక వేగంతో నడుపుతుంది. ఒక సాధారణ ట్రక్కు 7 నుండి 10 టన్నుల వస్తువులను మాత్రమే తీసుకువెళుతుంది.




## కేంద్ర మంత్రి కుమార్తెకు

# పోకిరీల వేధింపులు

**జల్‌గావ్:** తన కుమార్తెను వేధించారంటూ కేంద్ర యువజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి రక్షా ఖడ్సే పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహారాష్ట్రలో శాంతి భద్రతలపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. జల్‌గావ్ జిల్లా ముక్తాయ్‌నగర్‌లో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న తన కుమార్తెను అక్కడ కొందరు యువకులు వేధించారని.. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మంత్రి వెల్లడించారు. "ప్రతి ఏడాది మహాశివరాత్రి సందర్భంగా మా ప్రాంతంలో సంత్ ముక్తాయ్ యాత్ర జరుగుతుంది. రెండు రోజుల క్రితం నా కూతురు యాత్రకు వెళ్లింది. కొందరు యువకులు ఆమెను వేధించారు. వారిపై ఫిర్యాదు చేసేందుకు నేను పోలీస్ స్టేషన్‌కు వెళ్లాను' అని మీడియాకు కేంద్ర మంత్రి ఖడ్సే చెప్పారు. అడ్డుకున్న భద్రతా సిబ్బందిపైనా ఆ యువకులు దురుసుగా ప్రవర్తించారు. గుజరాత్ పర్యటన నుంచి నేను ఇంటికి రాగానే నా కుమార్తె ఈ విషయం చెప్పింది. కేంద్ర మంత్రి కుమార్తెకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే.. సాధారణ మహిళల సంగతి ఏంటో అర్థం చేసుకోవచ్చంటూ కేంద్ర మంత్రి ఖడ్సే వ్యాఖ్యానించారు. రక్షా ఖడ్సే మామ ఏక్‌నాథ్ ఖడ్సే మాట్లాడుతూ.. ఈ యువకులపై గతంలోనూ పోలీసులకు



ఫిర్యాదులు వచ్చాయి. వారు కరుడుగట్టిన నేరస్థులు. మహారాష్ట్రలో నేరస్థులకు పోలీసులంటే భయమే లేదు. రోజురోజుకు మహిళలపై నేరాలు పెరుగుతున్నాయి. బాధిత మహిళలు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు. వారి తల్లిదండ్రులు కూడా తమ కుమార్తెల పేర్లు బయటకు రాకూడదని భావిస్తున్నారు. వేరే మార్గం లేకనే ఫిర్యాదు చేశాం'' అని ఏక్‌నాథ్ ఖడ్సే తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వెళితే రెండు గంటలు మమ్మల్ని కూర్చోబెట్టారని.. అమ్మాయిల విషయం కావడంతో ఆలోచించుకోవాలంటూ పోలీసులు మాకు సలహా ఇచ్చారు. వేధింపులకు పాల్పడ యువకులకు రాజకీయ నాయకుల అండ ఉంది. డీఎస్పీ, ఐజీతో కూడా చెప్పాను'' అని ఖడ్సే తెలిపారు.


మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | సోమవారం, హైదరాబాద్ | 03-03-2025

ANN తెలుగు




# ఆ విషయంలో దురదృష్టవంతురాలిని.. మళ్లీ పెళ్లంటేనే భయమేస్తోంది

పెళ్లి మాట ఎత్తితేనే భయపడుతోంది బోల్డ్ బ్యూటీ, నటి పూనమ్ పాండే. విడాకుల తర్వాత తన జీవితం సంతోషంగా సాగుతోందని, మళ్లీ ఎవర్నైనా నమ్మాలంటే భయంగా ఉందని చెప్తోంది. పూనమ్ పాండే 2020లో ప్రియుడు సామ్ బాంబేను పెళ్లి చేసుకుంది. అతడితో గోవాకు హనీమూన్‌కు కూడా వెళ్లింది. ఆ సమయంలో సామ్ తనను వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు అతడిని అరెస్టు కూడా చేశారు. అదే సమయంలో పూనమ్ కళ్లు, ముఖంపై గాయాలతో ఆస్పత్రిలో చేరింది.

### రెండేళ్లుగా ఒంటరిగానే..

అవన్నీ గుర్తు చేసుకుంటేనే భయపడిపోతోంది పూనమ్ పాండే. రెండేళ్లుగా ఒంటరిగా ఉన్నాను. ఈ సమయంలో చాలా సంతోషంగా ఉన్నాను. వైవాహిక జీవితం నాకు కలిసిరాదేమో అనిపిస్తోంది. ఏదేమైనా ఇప్పుడైతే హాయిగా జీవిస్తున్నాను. నాకు అందమైన కుటుంబం, మంచి కెరీర్ ఉంది. ఈ రెండింటితో నేను సంతృప్తిగా ఉన్నాను. మళ్లీ పెళ్లి చేసుకోవాలంటే భయంగా ఉందని. ఎవరేంటో తెలుసుకోలేకపోతున్నాను. ఎవర్నీ నమ్మలేకున్నాను అని చెప్పుకొచ్చింది.

### వివాదాలతో సావాసం..

గతేడాది గర్భాయ ముఖద్వార క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఏకంగా తాను చనిపోయినట్లు ప్రచారం చేసుకుంది. ఆ వార్తలు వైరలయ్యాక తాను బతికే ఉన్నానని, క్యాన్సర్‌పై అవగాహన పెంచేందుకే అలాంటి ప్రాంక్ చేయాల్సి వచ్చిందని పేర్కొంది. 2011లో వరల్డ్‌కప్‌లో టీమిండియా గెలిస్తే మైదానంలో ఒంటి మీద నూలుపోగులేకుండా తిరుగుతానని ప్రకటించింది. ఇలాంటి సంచలన కామెంట్లు, డ్రామాలతోనే పూనమ్ ఎక్కువ పాపులర్ అయింది.


# దిల్‌రూబా స్టోరీ చెబితే బైక్ గిఫ్ట్‌గా ఇస్తా : కిరణ్ అబ్బవరం

'క' సినిమాతో సూపర్ హిట్ అందుకున్న యువ నటుడు కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'దిల్ రుబా' (Dilruba). ఈ సినిమాకి విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తుండగా.. రవి, జోజో, జోస్, రాకేష్‌రెడ్డి నిర్మిస్తున్నారు. రుక్సర్ ధిల్లాన్ కథానాయికగా నటిస్తుండగా.. మార్చి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది చిత్రయూనిట్. అయితే ఈ సినిమా ప్రమోసన్స్‌లో భాగంగా ఆసక్తికర ప్రకటనను చేశాడు కిరణ్. 'దిల్ రుబా' సినిమా కథ చెబితే ఈ సినిమాలో వాడిన బైక్‌ను గిఫ్ట్‌గా ఇస్తానంటూ ప్రకటించాడు. నా ప్రేమ, కోపం సమ్మేళనంగా తెరకెక్కిన చిత్రమే 'దిల్ రూబా'. ఈ సినిమాలో వాడిన బైక్ అంటే నాకు చాలా ఇష్టం. మా ఆర్ట్ డైరెక్టర్ ఈ బైక్‌ని చాలా కష్టపడి ప్రత్యేకంగా తీర్చిదిద్దాడు. బయట ఎక్కడ ఇలాంటి బైక్ కనిపించదు. ఇంత ఇష్టమైన బైక్‌ని మీకు గిఫ్ట్‌గా ఇచ్చేద్దాం అనుకుంటున్నా. ఈ బైక్ మీరు సొంతం చేసుకోవాలి అంటే మీరు చేయాల్సింది ఒక్కటే. ఇప్పటివరకూ విడుదలైన దిల్ రూబా పాటలు కావచ్చు, వీడియోలు కావచ్చు, ప్రమోషన్స్‌లో మేము మాట్లాడిన విషయాలు కావచ్చు. వీటిని ఆధారంగా చేసుకుని ఈ సినిమా కథ ఏమిటనేది మీరు ఆలోచించి చెప్పాలి. మోస్ట్ క్రియేటివ్‌గా ఎవరైతే చెబుతారో వారికి ఈ బైక్‌ని దిల్ రూబా సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో ఇస్తాను. అంతేగాకుండా ఈ కంటెస్ట్ గెలిచిన వారితో దిల్ రూబా ఫస్ట్ డే ఫస్ట్ షో కలిసి చూస్తాను అంటూ కిరణ్ చెప్పుకోచ్చాడు.



# రీఎంట్రీకి సిద్ధమైన రంభ

ఒకప్పుడు అగ్ర కథానాయికల్లో ఒకరిగా రాణించింది రంభ. తొంభై దశకంలో యువతరంలో మంచి క్రేజ్ సంపాదించుకొని పలు విజయవంతమైన చిత్రాల్లో భాగమైంది. కొన్నేళ్లుగా సినీ రంగానికి దూరంగా ఉంటున్న ఆమె తాజాగా రీఎంట్రీకి సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా రంభ మాట్లాడుతూ 'సినీరంగంలోకి పునరాగమనానికి ఇదే సరైన సమయం అనుకుంటున్నా. నా వయసుకు తగినట్లు చాలెంజింగ్ రోల్స్ చేయడానికి సిద్ధంగా ఉన్నా. మంచి పాత్రల ద్వారా తిరిగి ప్రేక్షకుల అభిమానం సంపాదించుకోవాలనుకుంటున్నా' అని చెప్పింది.




# గోప్యంగా ఉంచమని అమ్మ చెప్పింది

'మనిషికి మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యం. మానసికంగా బలంగా లేకపోతే.. శారీరకంగా కూడా బలహీనపడే అవకాశం ఉంటుంది. మెదడు నుంచి శరీరానికి పాజిటీవ్ సిగ్నల్స్ వెళ్లాలి కానీ.. నెగెటివ్ సిగ్నల్స్ వెళ్లకూడదు. అలా జరిగితే ప్రమాదంలో పడతాం.' అంటూ చెప్పుకొచ్చింది బాలీవుడ్ భామ దీపికా పదుకొణె. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కొన్నేళ్ల క్రితం మానసికంగా తాను ఎదుర్కొన్న సమస్యల్ని ఆమె గుర్తుచేసుకున్నది. '2014లో కెరీర్ పరంగా పీక్స్‌లో ఉన్నా. క్షణం తీరిక లేకుండా సినిమాలు చేస్తున్న రోజులవి. పైగా అన్ని విషయాల్లోనూ ఆనందంగా ఉన్నా. అలాంటి సమయంలో ఓసారి తీవ్ర అలసటకు గురై లొకేషన్‌లోనే కళ్లు తిరిగి పడిపోయా. ఇవన్నీ వృత్తిలో భాగమేలే అని ముందు లైట్ తీసుకున్నా. కానీ ఎందుకో మనసు కీడు శంకించడం మొదలుపెట్టింది. అందుకే.. అవసరమైన స్కానింగులు, టెస్ట్‌లు చేయించుకున్నా. నా పరిస్థితి అంత బాలేదని అర్థమైంది. నిజానికి ట్రీట్మెంట్ తీసుకుంటే తగ్గిపోయే సమస్యలే అవన్నీ. కానీ ఏదో అయిపోతున్నట్టు భయపడిపోయేదాన్ని. విపరీతంగా ఏడ్చేసేదాన్ని. మానసికంగా కృంగిపోయా. నా విషయం తెలుసుకొని మా అమ్మ నన్ను చూడ్డానికి ముంబయ్ వచ్చింది. అమ్మ సూచన ప్రకారం థెరపిస్ట్‌ని కలిశాను. నేను థెరపిస్ట్ వద్దకు వెళ్తున్న విషయాన్ని గోప్యంగా ఉంచమని అమ్మ చెప్పింది. అమ్మమాటను పాటించి, ఎవరికీ తెలీకుండా సీక్రెట్‌గా థెరపీ తీసుకునేదాన్ని. నిదానంగా ఈ రుగ్మత నుంచి తేరుకున్నా. కోలుకున్న తర్వాత అనిపించింది. మానసిక ఆరోగ్యం గురించి అందరికీ అర్థమయ్యేలా చెప్పాలని. 'లివ్ లాఫ్ లవ్' ఫౌండేషన్ నేను స్థాపించడానికి కారణం అదే.' అంటూ గుర్తు చేసుకున్నది దీపిక పదుకొణె.






## క్రీడా వార్తలు | SPORTS NEWS






# న్యూజిలాండ్‌పై టీమిండియా ఘన విజయం

### వరుణ్ స్పిన్ ధాటికి.. న్యూజిలాండ్ విలవిల.. టీమిండియా హ్యాట్రిక్ విజయం

(మొదటిపేజీ తరువాయి)

న్యూజిలాండ్ 45.3 ఓవర్లలో 205 పరుగులకు ఆలౌటైంది. వరుణ్ చక్రవర్తి ఐదు వికెట్లు తీసి న్యూజిలాండ్ పతనాన్ని శాశించాడు. కేన్ విలియమ్సన్ (81) న్యూజిలాండ్‌ను గెలిపించేందుకు విఫలయత్నం చేశాడు. ఈ గెలుపు అనంతరం భారత్ గ్రూప్‌ఏ టాపర్‌గా నిలిచింది. తద్వారా సెమీస్‌లో గ్రూప్‌బిలో రెండో స్థానంలో నిలిచిన ఆస్ట్రేలియాతో తలపడతుంది. మార్చి 4న ఈ మ్యాచ్ జరుగనుంది. అనంతరం మార్చి 5న జరిగే రెండో సెమీఫైనల్లో గ్రూప్‌ఏలో రెండో స్థానంలో నిలిచిన న్యూజిలాండ్.. గ్రూప్‌బి టాపర్ సౌతాఫ్రికాను ఢీకొట్టనుంది.

### రాణించిన శ్రేయస్, హార్దిక్, అక్షర్

తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. శ్రేయస్ అయ్యర్ (79), అక్షర్ పటేల్ (42), హార్దిక్ పాండ్యా (45) రాణించడంతో గౌరవప్రదమైన స్కోర్ చేయగలిగింది. ఈ మ్యాచ్‌లో భారత టాప్3 బ్యాటర్లు రోహిత్ శర్మ (15), శుభ్‌మన్ గిల్ (2), విరాట్ కోహ్లి (11) విఫలమయ్యారు. మధ్యలో కేఎల్ రాహుల్ (23) కాసేపు నిలకడగా ఆడాడు. ఆఖర్లో రవీంద్ర జడేజా 16, షమీ 5 పరుగులకు ఔటయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో జేమీసన్ ఐదు వికెట్లు తీసి టీమిండియాను దెబ్బకొట్టాడు. విలియమ్ రూర్కీ, మిచెల్ సాంట్నర్, రచిన్ రవీంద్ర తలో వికెట్ తీశారు.

### ఐదేసిన వరుణ్

250 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన న్యూజిలాండ్.. భారత బౌలర్లు మూకుమ్మడిగా దాడి చేయడంతో లక్ష్యానికి 45 పరుగుల దూరంలో నిలిచిపోయింది. కెరీర్‌లో రెండో వన్డే ఆడుతున్న వరుణ్ ఐదు వికెట్లు తీసి న్యూజిలాండ్ పతనాన్ని శాశించాడు. కుల్దీప్ 2, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా తలో వికెట్ తీసి భారత్ గెలుపులో తమవంతు పాత్ర పోషించారు. వీరందరూ చెలరేగడంతో భారత్ 250 పరుగుల లక్ష్యాన్ని విజయవంతంగా కాపాడుకుంది. ఓ పక్క క్రమం తప్పకుండా వికెట్లు పడుతున్నా న్యూజిలాండ్‌ను గెలిపించేందుకు విలియమ్సన్ విఫలయత్నం చేశాడు. అయితే అతనికి సహచరుల నుంచి ఎలాంటి సహకారం లభించలేదు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో విల్ యంగ్ 22, రచిన్ రవీంద్ర 6, డారిల్ మిచెల్ 17, టామ్ లాథమ్ 14, గ్లెన్ ఫిలిప్స్ 12, బ్రేస్‌వెల్ 2, మ్యాట్ హెన్రీ 2, విలియమ్ ఓరూర్కీ 1 పరుగు చేశారు. ఆఖర్లో మిచెల్ సాంట్నర్ (28) బ్యాట్ ఝులిపించినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

## సెమీస్‌లో టీమిండియా ప్రత్యర్థి ఆస్ట్రేలియా..

# నాటి పరాభవానికి ప్రతీకారం తీర్చుకుంటుందా..?





ఛాంపియన్స్ ట్రోఫీ2025 సెమీఫైనల్లో ఏయే జట్లు తలపడబోతున్నాయో తేలిపోయింది. ఇవాళ (మార్చి 2) జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై విజయంతో భారత్ గ్రూప్‌ఏ టాపర్‌గా నిలిచింది. తద్వారా సెమీస్‌లో గ్రూప్‌బిలో సెకెండ్ ప్లేస్‌లో నిలిచిన ఆస్ట్రేలియాతో అమీతుమీకి సిద్ధమైంది. భారత్, ఆస్ట్రేలియా వన్డే ఫార్మాట్‌లో చివరిసారిగా 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో తలపడ్డాయి. నాటి మ్యాచ్‌లో ఆసీస్ భారత్‌ను ఓడించి జగజ్జేతగా నిలిచింది. దాదాపుగా ఏడాదిన్నర తర్వాత భారత్‌కు ఆసీస్‌పై ప్రతీకారం తీర్చుకునే అవకాశం వచ్చింది. ఈ అవకాశాన్ని టీమిండియా సద్వినియోగం చేసుకుంటుందో లేదో వేచి చూడాలి. భారత్, ఆస్ట్రేలియా మధ్య తొలి సెమీఫైనల్ మార్చి 4న దుబాయ్ వేదికగా జరుగనుంది. నేటి మ్యాచ్‌లో ఫలితంతో రెండో సెమీస్‌లో ఎవరెవరు తలపడబోతున్నారో కూడా తేలిపోయింది. భారత్ చేతిలో ఓటమితో న్యూజిలాండ్ గ్రూప్ ఏలో రెండో స్థానంలో నిలిచింది. తద్వారా గ్రూప్ బి టాపర్ అయిన సౌతాఫ్రికాను రెండో సెమీస్‌లో ఢీకొంటుంది. ఈ మ్యాచ్ లాహోర్ వేదికగా మార్చి 5న జరుగుతుంది. అనంతరం రెండు సెమీఫైనల్స్‌లో విజేతలు మార్చి 9న జరిగే ఫైనల్లో అమీతుమీ తేల్చుకుంటాయి. తొలి సెమీస్‌లో ఆసీస్‌ను ఓడించి టీమిండియా ఫైనల్‌కు చేరితే దుబాయ్ వేదికగా అంతిమ సమరం జరుగుతుంది. ఒకవేళ సెమీస్‌లో టీమిండియా ఆసీస్ చేతిలో ఓడితే లాహోర్ ఫైనల్ మ్యాచ్‌కు వేదికవుతుంది.

### హ్యాట్రిక్ విజయాలు

భారత్ గ్రూప్‌ఏలో హ్యాట్రిక్ విజయాలు సాధించి అజేయ జట్టుగా సెమీస్‌కు చేరింది. తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను ఓడించిన టీమిండియా.. రెండో మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను మట్టికరిపించింది. చివరిగా ఇవాళ జరిగిన మ్యాచ్‌లో భారత్ న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించింది. మరోవైపు ఆస్ట్రేలియా ఈ టోర్నీలో ఒకే ఒక మ్యాచ్‌లో విజయం సాధించినప్పటికీ సెమీస్‌కు అర్హత సాధించింది. గ్రూప్ దశలో ఆఫ్ఘనిస్తాన్, సౌతాఫ్రికా మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దు కాగా.. ఆసీస్ ఇంగ్లండ్‌పై మాత్రమే గెలుపొందింది.

### 44 పరుగుల తేడాతో కివీస్‌ను చిత్తు చేసిన టీమిండియా

గ్రూప్‌ఏలో భాగంగా ఇవాళ జరిగిన చివరి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై భారత్ 44 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేయగా.. ఛేదనలో తడబడిన న్యూజిలాండ్ 45.3 ఓవర్లలో 205 పరుగులకు ఆలౌటైంది. వరుణ్ చక్రవర్తి ఐదు వికెట్లు తీసి న్యూజిలాండ్ పతనాన్ని శాశించాడు. కేన్ విలియమ్సన్ (81) న్యూజిలాండ్‌ను గెలిపించేందుకు విఫలయత్నం చేశాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com